



నర్సీపట్నం గచ్చపువీధిలో ఇంటి మీద పడిన విద్యుత్ స్తంభం

మందకొడిగా ఖరీఫ్

వర్షాభావ పరిస్థితులతో ముందుకు సాగని వరినాట్లు

- నీరు అందుబాటులో లేనిచోట్ల ఎండిపోయిన నారు
- 54,465 హెక్టార్లలో వరి సాగు లక్ష్యం
- ఇంతవరకు 3,651 హెక్టార్లలో మాత్రమే వరినాట్లు
- అన్నదాతల్లో ఆందోళన



బుచ్చెయ్యపేట మండలం దిబ్బిడిలో ముదిరిన వరి నారు

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో ఖరీఫ్ సాగు ఆశాజనకంగా లేదు. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు ముందుగానే వస్తాయని వాతావరణ శాఖ వెల్లడించిన నేపథ్యంలో ఖరీఫ్ సాగుకు కష్టాలు ఉండవని రైతులు భావించారు. కానీ సుమారు నెల రోజుల నుంచి నెలకొన్న ప్రతికూల వాతావరణ పరిస్థితులు రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఒకవైపు వర్షాలు లేక సాగునీటి కష్టాలను ఎదుర్కొంటుండగా మరోవైపు వేసవిని తలపించేలా ఎండలు మండిపోతుండడంతో వరి నారు ఎండిపోతున్నది. అక్కడక్కడ చెరువుల కింద ఇప్పటికే వేసిన వరి నాట్లు ఎండిపోతున్నాయి. అదును దాటిపోతున్నా సరిపడా వర్షాలు కురవకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. జూన్, జూలై నెలల్లో అడపాదడపా కురిసిన వర్షాలతో వరి నారు పోసుకున్న రైతులు.. ఆగస్టు రెండో వారం గడిచిపోతున్నా సరైన వర్షాలు లేకపోవడంతో వరినాట్లు వేయలేని పరిస్థితి నెలకొంది. ఆకుమడుల్లో వరినారును బతికించుకోవడానికి నానాపాట్లు పడుతున్నారు. జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్‌లో 71,417 హెక్టార్లలో వివిధ రకాల పంటలు సాగవుతాయని వ్యవసాయాధికారులు అంచనా వేశారు. అయితే ఇప్పటి వరకు 8,115 హెక్టార్లలో మాత్రమే పంటలు వేశారు.

మందకొడిగా వరి నాట్లు

జిల్లాలో ఏడాది ఖరీఫ్‌లో 54,465 హెక్టార్లలో వరి సాగు చేపట్టాల్సి ఉండగా సోమవారం వరకు 3,651 హెక్టార్లలో మాత్రమే వరినాట్లు పడినట్టు వ్యవసాయాధికారుల నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఆకుమడిలో వరివిత్తనాలు పోసిన తరువాత 25 నుంచి 30 రోజుల్లో నాట్లు వేయాలి. లేనిపక్షంలో నారు ముదిరిపోతుంది. ఎటా మాదిరిగానే జూన్ చివరి వారం నుంచి జూలై మూడో వారం వరకు ఆకుమడుల్లో వరివిత్తనాలు వేశారు. ముందుగా విత్తనాలు వేసిన మడుల్లో వరినారు అందుబాటులోకి వచ్చినప్పటికీ పొలాలను దమ్ముపట్టడానికి సరిపడ నీరు లేకపోవడంతో నారు ముదిరిపోతున్నది. ఇక వర్షాధార భూముల్లో అయితే వరి నారు ఎండిపోయింది. జలాశయాల నుంచి సకాలంలో నీటిని విడుదల చేసినప్పటికీ, వర్షాలు లేకపోవడంతో దమ్ము, వరినాట్లు పనులకు నీటి అవసరం ఎక్కువగా వుంటున్నది. దీంతో కాలువ చివరి భూములకు నీరు రాని పరిస్థితి నెలకొంది. రైవాడ జలాశయం వున్న దేవరాపల్లి మండలంలో వరి ఖరీఫ్ సాగు విస్తీర్ణం 3,424 హెక్టార్లు కాగా ఇప్పటి వరకు 1,221 హెక్టార్లలో మాత్రమే నాట్లు పూర్తయ్యాయి. తాండవ జలాశయం వున్న నాతవరం మండలంలో 6,210 హెక్టార్లలో వరి నాట్లు వేయాల్సి ఉండగా ఇంత వరకు 115 హెక్టార్లలో మాత్రమే పడ్డాయి. పెద్దేరుతోపాటు పలు చిన్నపాటి రిజర్వాయర్లు వున్న వి.మాడుగుల మండలంలో 4,287 హెక్టార్లకుగాను 641 హెక్టార్లలో... మిగతా 8వ పేజీలో



మాకవరపాలెంలో ఎండిపోయిన వరి నారు

నారు ఎండిపోయింది



ఈ ఏడాది ఖరీఫ్‌లో నాలుగు ఎకరాల్లో వరి సాగు చేయాలనుకన్నాను. సుమారు నెల రోజుల క్రితం ఆకుమడిలో విత్తనాలు చల్లాను. నారు కొంతమేర పెరిగిన తరువాత వర్షాలు పడలేదు. నీటి తడులు ఇద్దామంటే చుట్టుపక్కల ఎక్కడా నీరు అందుబాటులో లేదు. దీంతో వరినారు ఎండిపోయింది.

\- మొగ్గు స్వామినాయుడు,
పీఎస్ఆర్ పేట, ఎలమంచిలి మండలం

ప్రశ్నార్థకంగా వరి సాగు



రెండు ఎకరాల్లో వరి సాగు చేయడానికి నారు పోశాను. తరువాత వర్షాలు లేకపోవడంతో నారు ఎదుగుదల లేదు. గత వారం రోజులుగా వర్షాలు లేకపోగా.. వేసవిని తలపించేలా ఎండలు కాస్తుండడంతో నారు ఎండిపోయింది. పొలంలో నేరుగా విత్తనాలు చల్లుకుని వరి సాగు చేద్దామంటే వర్షం పడడంలేదు. ఈ ఏడాది ఖరీఫ్ సాగు ప్రశ్నార్థకంగా మారింది.

\- జి.గోవిందరావు,
సర్వసిద్ధి, ఎస్.రాయవరం మండలం

ఈ నెలాఖరు వరకు సమయం ఉంది

వర్షాభావ పరిస్థితుల కారణంగా జిల్లాలో ఇప్పటి వరకు ఎనిమిది శాతం విస్తీర్ణంలో మాత్రమే వరి నాట్లు పూర్తయ్యాయి. వరి నాట్లు పూర్తి చేసుకొనేందుకు ఆగస్టు నెలాఖరు వరకు సమయం ఉంది. ఈ నెల 13వ తేదీ నుంచి వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ చెబుతున్నది. దీంతో వరినాట్లు ముమ్మరం అవుతాయి. ఒకవేళ వరి నారు ముదిరిపోతే.. చివర్లు తుంచి పొలంలో నాటుకోవచ్చు.

బి.మోహన్‌రావు, జిల్లా వ్యవసాయాధికారి

గాలి, వాన బీభత్సం

నర్సీపట్నంలో పలుచోట్ల కూలిన చెట్లు

- ఆర్టీసీ కాంప్లెక్స్‌లో పడిపోయిన భారీ వృక్షం
- విరిగిపడిన కరెంటు స్తంభాలు
- విద్యుత్ సరఫరాకు అంతరాయం



కె.కోటపాడులో కురుస్తున్న వర్షం

నర్సీపట్నం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి):

నర్సీపట్నంలో గాలి, వాన బీభత్సం సృష్టించాయి. సోమవారం సాయంత్రం 4.30 గంటల నుంచి 5.15 గంటలకు వరకు ఈదురు గాలులతో భారీ వర్షం కురిసింది. పట్టణంలో పలు చోట్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. ఆర్టీసీ కాంప్లెక్స్ ఇన్‌గేట్ మార్గంలో భారీ వృక్షం పడి పోయి వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఇక్కడ చెట్ల కొమ్మలు తగిలి ఒక వ్యక్తి గాయపడ్డాడు. మునిసిపల్, అగ్నిమాపక, పోలీసు సిబ్బంది రంగంలోకి దిగి యుద్ధ ప్రాతిపదికన చెట్లను తొలగించారు. శివపురంలో మూడు విద్యుత్ స్తంభాలు పడిపోయాయి. గచ్చపువీధిలో కైసర్ల సత్తిబాబు ఇంటి మీద కరెంటు స్తంభం పడింది. పాత డీఎఫ్‌వో కార్యాలయంలో టేకు చెట్టు కూలిపోవడంతో దాని కొమ్మలు గచ్చపువీధి వైపు పడిపోయి విద్యుత్ స్తంభం విరిగి పోయింది. తురకబది, కన్యకాపరమేశ్వరి గుడి వద్ద చెట్ల కొమ్మలు విరిగి పడడంతో విద్యుత్ వైర్లు తెగిపోయాయి. పాత మునిసిపల్ కార్యాలయం పక్క రోడ్డులో చెట్టు పడిపోవడంతో వాహనాల రాకపోకలు స్తంభించాయి. కాగా సుమారు 45 నిమిషాలపాటు భారీ వర్షం పడడంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. మెయిన్ రోడ్డుతోపాటు వెంకునాయుడుపేట, శారదానగర్, శివపురం తదితర ప్రాంతాల్లో ... మిగతా 8వ పేజీలో



నర్సీపట్నం కన్యకాపరమేశ్వరి ఆలయం ఎదుట రోడ్డుకు అడ్డంగా పడిపోయిన చెట్టు

పట్టణ నడిబొడ్డున కంపోస్టు యార్డు!

జీవీఎంసీ జోనల్ కార్యాలయం ఆవరణలో చెత్తా డంపింగ్

- కుళ్లిపోయి తీవ్ర దుర్వాసన
- ఇబ్బందులు పడుతున్న చుట్టుపక్కల నివాసితులు
- పదేళ్ల నుంచి తరలింపునకు నోచుకోని వైనం



జోనల్ కార్యాలయం ఆవరణలో ట్రాన్సిట్ కంపోస్టు యార్డు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి):

రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా అనకాపల్లి పట్టణ నడిబొడ్డున ఉన్న జీవీఎంసీ జోనల్ కార్యాలయంలో కంపోస్టుట్రాన్సిట్ యార్డు కొనసాగుతున్నది. దీనిని ఇక్కడి నుంచి తరలించేందుకు పదేళ్ల నుంచి ఎవరూ పట్టించుకోకపోవడంతో చుట్టుపక్కల ఇళ్లవారు, జీవీఎంసీ పాఠశాల, జూనియర్ కళాశాల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

కంపోస్టుయార్డు పదేళ్ల క్రితం వరకు కొత్తూరు పంచాయతీ పరిధిలోని శారదానగర్‌లో కొనసాగింది. అయితే కంపోస్టుయార్డు వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని స్థానికులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లడంతో అక్కడ కంపోస్టుయార్డును మూసివేశారు. మరోచోట కంపోస్టుయార్డు ఏర్పాటు చేసేందుకు అప్పటి మునిసిపల్ అధికారులు పట్టణానికి చుట్టుపక్కల వున్న పలు గ్రామాల్లో స్థలాలను పరిశీలించారు. కానీ స్థానికుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. కొప్పాక రైల్వే వంతెన వద్ద కొంతకాలంపాటు చెత్త వేయడంతో ... మిగతా 8వ పేజీలో

డ్వాక్రాలకు మరింత వెలుగు

రుణాల సద్వినియోగానికి ప్రభుత్వం పలుచర్యలు

- జీవనోపాధితోపాటు వ్యక్తిగత అవసరాలకు రుణ సహకారం
- పలు రకాల స్వయం ఉపాధి యూనిట్ల స్థాపనకు ప్రాధాన్యం
- అవసరమైన సమయంలోనే రుణం తీసుకునే వెసులుబాటు
- నిధుల దుర్వినియోగం, అనవసర వ్యయాలకు అడ్డుకట్ట
- 'మన డబ్బులు... మన లెక్కలు' యాప్‌కు రూపకల్పన



డ్వాక్రా మహిళలకు 'నెక్' సహకారంతో కోడిగుడ్లతో తయారు చేసే ఆహారాన్ని విక్రయించేందుకు మంజూరు చేసిన స్టాల్

చోడవరం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి):

డ్వాక్రా మహిళలు బ్యాంకుల నుంచి తీసుకునే రుణాల సొమ్మును అనవసర ఖర్చులకు కాకుండా, ఆర్థికాభివృద్ధికి దోహపడి వాటికి పెట్టుబడిగా పెట్టించడానికి రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. తద్వారా వారి జీవితాల్లో కొత్త వెలుగులు నింపడానికి ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నది. కుటుంబ జీవనోపాధితోపాటు, వ్యక్తిగత అవసరాలకు సైతం రుణాలు తీసుకునేందుకు అవకాశం ఇస్తూ పలు మార్పులకు శ్రీకారం చుట్టింది. గతంలో మాదిరిగా అప్పు అవసరం ఉన్నా, లేకున్నా అందరితోపాటు, రుణం తీసుకోవడం, దానిని ఇతరత్రా ఖర్చులకు వినియోగించడం వల్ల అనవసర వ్యయం జరిగేది. అలాగే డబ్బులు అవసరం లేని వారి పేరిట కొంత మంది రుణాలు తీసుకుని తిరిగి చెల్లించకపోవడం వంటి కారణాల వల్ల సంఘం సభ్యులపై వడ్డీ భారం పడడం, సంఘాలు సరిగా నడవని పరిస్థితి ఏర్పడుతున్నది. తాజా మార్గదర్శకాల ప్రకారం మహిళలు తమకు అవసరమైన రుణాన్ని కావాల్సిన సమయంలో బ్యాంకు నుంచి పొందేలా రూపకల్పన చేశారు. దీనివల్ల రుణం తీసుకున్న నాటి నుంచే వడ్డీ పడుతుంది.

డ్వాక్రా సంఘాలకు ఇప్పటి వరకు వ్యవసాయ అవసరాలు, కుటుంబ జీవనోపాధికి మాత్రమే రుణాలు ఇస్తూ వచ్చారు. తాజాగా జీవనోపాధితోపాటు, ఇతర వ్యక్తిగత అవసరాలకు సైతం రుణాలు ఇప్పించాలని ప్రభుత్వం సంకల్పించింది. వ్యక్తిగత అవసరాలు అంటే.. పిల్లల చదువులు, ఇంటి నిర్మాణం, పిల్లల పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలు వంటి వంటికి రుణం తీసుకునే వెసులుబాటు కల్పించింది. ఇందుకోసం డ్వాక్రా సభ్యులతో వెలుగు సిబ్బంది సమావేశం నిర్వహించి, వారికి ఏయే అవసరాలకు రుణాలు కావాలి? ఎప్పుడు తీసుకుంటారు? వంటి వివరాలను వెలుగు సిబ్బంది ముందుగానే సేకరించాలి. దీని ప్రకారం బ్యాంకులు రుణాలు మంజూరు చేస్తాయి. గతంలో మాదిరిగా అవసరం ఉన్నా లేకున్నా, ఎప్పుడుపడితే ... మిగతా 8వ పేజీలో

అరకొర బస్సులతో అవస్థలు

ఫుట్‌బోర్డుపై వేలాడుతూ ప్రయాణిస్తున్న విద్యార్థులు

పట్టుతప్పితే ప్రాణాలకే ముప్పు



ఆర్టీసీ పల్లె వెలుగు బస్సు ఫుట్‌బోర్డుపై వేలాడుతూ ప్రయాణిస్తున్న విద్యార్థులు

ఎలమంచిలి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి):

ఆర్టీసీ బస్సుల కొరతతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో బస్సులు కిక్కిరిసిపోతుండడంతో కొంతమంది విద్యార్థులు ఫుట్‌బోర్డు వద్ద వేలాడుతూ, ప్రమాకరరీతిలో ప్రయాణిస్తున్నారు. ఎలమంచిలిలోని ప్రభుత్వం, జూనియర్ కళాశాలల్లో వందలాది మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వీరిలో చాలా మంది ఎలమంచిలి మండలంతోపాటు పక్కనే వున్న రాంబిల్లి, ఎస్.రాయవరం, కశింకోట మండలాల నుంచి రోజూ రాకపోకలు సాగిస్తుంటారు. ఆయా మండలాల నుంచి/ మీదుగా ఎలమంచిలి నడిచే బస్సులు నామమాత్రంగానే వున్నాయి. ఈ మార్గాల్లో ఆటోలు వున్నప్పటికీ ఉదయం, సాయంత్రం వేళల్లో విద్యార్థులతోపాటు ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, కూలీలు ఎక్కువగా బస్సులపైనే ఆధారపడుతుంటారు. సాయంత్రం తిరిగి ఇళ్లకు వెళ్లేటప్పుడు కూడా ఇదే పరిస్థితి. సాయంత్రం పాఠశాలలు, కళాశాలలు విడిచిపెట్టిన తరువాత ఎలమంచిలి బస్టాండ్ విద్యార్థులతో నిండిపోతుంది. బస్సు రావడంతోనే ఒక్కసారిగా ఎగబడుతుంటారు. ఈ క్రమంలో తోపులాటలు చోటుచేసుకుంటున్నాయి. విద్యార్థులు ఎక్కువ, బస్సులు తక్కువ వుండడంతో ఒక్కో బస్సులో వందమంది వరకు ఎక్కాల్సి వస్తున్నది. లోపల ఖాళీ లేక.. పుస్తకాల బ్యాగులతో ఫుట్‌బోర్డుపై వేలాడుతూ ప్రయాణించాల్సి వస్తున్నది. ఏమాత్రం పట్టుతప్పినా.. కిందపడిపోయి ప్రాణాల మీదుకు తెచ్చుకుంటున్నారు. ఆర్టీసీ అధికారులు, పోలీసులు స్పందించి ఉదయం, సాయంత్రం వేళల్లో పల్లె వెలుగు బస్సులను మరింటిని అందుబాటులోకి తీసుకురావాలని, ఫుట్‌బోర్డు ప్రయాణాలను కట్టడి చేయాలని పలువురు కోరుతున్నారు.

ఎన్నాళ్లీ నరక ప్రయాణం!



మాడుగుల మండలం కాశీపురం వద్ద ఛిద్రమైన రహదారి

తాటిపర్తి నుంచి వెంకన్నపాలెం వరకు అధ్వానంగా మెయిన్ రోడ్డు

- అధిక సంఖ్యలో గుంతలు, వాటిలో వర్షం నీరు చేరి చెరువులను తలపిస్తున్న దుస్థితి
- రాకపోకలకు తీవ్ర అవస్థలు పడుతున్న ప్రజలు
- పాడేరు- విశాఖపట్నం మెయిన్ రోడ్డు దుస్థితిపై ప్రయాణికుల పెదవి విరుపు

(పాడేరు- ఆంధ్రజ్యోతి)

మన్యం నుంచి మైదాన ప్రాంతానికి రాకపోకలు సాగించాలంటే మన్యం వాసులు నరకం చూస్తున్నారు. ప్రధానంగా పాడేరు నుంచి విశాఖపట్నం వెళ్లే మెయిన్‌రోడ్డు వి.మాడుగుల, చోడవరం మండలాల పరిధిలోని మార్గమంతా గతుకులుగా ఉండడమే కారణం. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వం ఈరోడ్డు దుస్థితిపై కనీసం పట్టించుకోపోగా కూటమి ప్రభుత్వం ఏడాదవుతున్నా దానికి మోక్షం కలగకపోవడం గమనార్హం. ఏజెన్సీ ప్రాంతానికి చెందిన అధిక సంఖ్యలో జనం నిత్యం విశాఖపట్నం, చోడవరం, అనకాపల్లి, తదితర ప్రాంతాలకు రాకపోకలు ... మిగతా 8వ పేజీలో



మాడుగుల మండలం కోడూరు వద్ద రహదారిపై గోతులు

'తాండవ'కు జలకళ

▸ దమ్ములు పట్టడానికి సిద్ధపడుతున్నరైతన్నలు



తాండవ నదిలో నీరు ప్రవహిస్తున్న దృశ్యం

పాయకరావుపేట రూరల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాండవ నదిలో జలకళ సంతరించుకుంది. గత రెండు రోజులుగా ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షాలకుతాండవ నదిలో నీరు చేరడంతో సాగునీటి కాలువలు నిండుగా ప్రవహిస్తున్నాయి. మండలంలో మండుతున్న ఎండలకు రైతులు దమ్ములు పట్టలేదు. తాండవ నదిలో ప్రవహిస్తున్న నీటిని కాలువల ద్వారా పొలాలకు చేరుతుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దమ్ములు పట్టి వరి నాట్లు వేయడానికి సిద్ధపడుతున్నారు. మండలంలో 3 వేల హెక్టార్లలో రైతులు వరిని సాగు చేస్తున్నారు. ఈ ఏడాది ప్రారంభంలో వర్షాలు కురిసినా తరువాత వరుణుడు ముఖం చాటేయడంతో మండలంలో నాట్లు ఆలస్యంగా ప్రారంభమవుతున్నాయి.

జనావాసాల మధ్య మురుగు నీరు

▸ గ్రామంలో పెరిగిన దోమలు

▸ జ్వరాల బారిన వాడనర్సాపురం వాసులు

▸ పట్టించుకోని పాలకులు, అధికారులు



వాడనర్సాపురంలో ఇళ్ల మధ్య నిలిచిపోయి దుర్వాసన వెదజల్లుతున్న మురుగునీరు

రాంబిల్లి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మత్స్యకార వాడనర్సాపురం గ్రామంలో ఇళ్ల మధ్య మురుగునీరు నిలిచి పోయింది. పలు వీధుల్లోని ఇళ్లలో వాడుకనీరు వచ్చి ఒకచోట చెరువులా తయారయ్యింది. దీంతో దోమలు పెరిగి గ్రామస్థులు జ్వరాల బారిన పడ్డారు. అయినా పంచాయతీ పాలకులు, అధికా రులు పట్టించుకోవడం లేదు. గ్రామంలో 3 వేల జనాభా నివసిస్తున్నా.. డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో ఇళ్లలోని వాడుక నీరు సీసీ రోడ్లపై ప్రవహిస్తున్నది. ఎక్కడి పడితే అక్కడ ఇళ్ల మధ్యలో మురుగునీరు నిలిచిపోయి, దుర్వాసన వస్తోంది. దీంతో దోమలు తీవ్రత పెరగడంతో గ్రామంలో వైరల్ జ్వరాలు ప్రజలాయని స్థానికులు తెలిపారు. ఆర్థిక స్తోమత ఉన్నవారు ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించి వైద్య సదుపాయాలు పొందుతున్నారు. పేద మత్స్యకారులు ఆర్‌పీ డాక్టర్లు, రాంబిల్లిలోని పీహెచ్‌సీని ఆశ్రయించి వైద్యసేవలు పొందుతున్నారని గ్రామస్థులు చెబుతున్నారు. గ్రామంలో వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసి జ్వరాలు బారిన పడిన రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులను అందజేయాలని వాడనర్సాపురం గ్రామస్థులు కోరుతున్నారు.పంచాయతీ పాలకులు గాని, అధికారులు గాని కనీసం పట్టించుకోవడం లేదని మత్స్యకారులు ఆరోపిస్తున్నారు. గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేసి ఇబ్బందులు లేకుండా చూడాలని పలు మార్లు గత, ప్రస్తుత పాలకులకు, అధికారులకు వినతులు అందజేసినా ఎటువంటి చర్యలు తీసుకోవడంలేదని గ్రామస్థులు వాపోతున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

బల్క్‌డ్రగ్‌కు వ్యతిరేకంగా వినతిపత్రాలు



ఆర్డీవో రమణకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

నక్కపల్లి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): బల్క్‌డ్రగ్ పార్కుకు తమ భూములు ఇవ్వమని, బల్క్‌డ్రగ్ పార్కు ఏర్పాటుకు తాము వ్యతిరేకమని మండలంలోని జానకయ్యపేట, సీహెచ్ఎల్ పురం గ్రామాల రైతులు స్పష్టం చేశారు. సోమవారం నక్కపల్లిలో తహసీల్దార్ నర్సింహమూర్తి, నర్సీపట్నంలో ఆర్డీవో వీవీవీ రమణ, అనకాపల్లిలో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అధికారులను కలిసి వినతిపత్రాలు అందజేశారు. వైసీపీ మండల అధ్యక్షుడు శీరం నర్సింహమూర్తి, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు, దేవర సత్తిబాబు నేతృత్వంలో వీరంతా అధికారులను కలిసి తమ ఆవేదన వెలిబుచ్చారు. తమకు జీవనాధారమైన భూములను బల్క్‌డ్రగ్ కోసం వదులుకోమని స్పష్టం చేశారు. భూ సేకరణకు సంబంధించి తమకు ఇచ్చిన 6(ఏ) నోటీసులను ఉపసంహరించుకోవాలని కోరారు.

జిల్లా స్థాయి భజన పోటీల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

అచ్యుతాపురం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మోసయ్యపేట గౌరీపరమేశ్వరుల ఆలయంలో ఈనెల 17 నుంచి జరిగే జిల్లా భజన పోటీల వాల్‌పోస్టర్‌ని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ సోమవారం తన స్వగృహంలో ఆవిష్కరించారు. స్థానిక గౌరీ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే ఈ పోటీలను ఓం భారతీ శక్తి పీఠం వ్యవస్థాపకులు గురుజీ భారతానంద పర్యవేక్షణలో జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి రాజాన రమేష్ కుమార్, జనపరెడ్డి శ్రీనివాసరావు, పుర్రే శ్రీనివాస యాదవ్, యల్లపు వెంకట రావు, లాలం రాము తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ యువజన మందిరం వార్షికోత్సవ కరపత్రం ఆవిష్కరణ

మునగపాక, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మునగపాక గ్రామీణ యువజన మందిరం 61వ వార్షికోత్సవ కరపత్రాన్ని ఎమ్మెల్యే విజయకుమార్ సోమవారం అచ్యుతాపురంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యువజన మందిరం అధ్యక్షుడు ఆడారి శ్రీకాంత్, మళ్ల రామజోగి, ఆడారి సూర్యచంద్రరామారావు, ఏవీ.సత్యనారాయణ, ఆడారి గణేష్, కేవీ.రావు పాల్గొన్నారు.

దళిత ఉద్యమ నేత నూకరాజు మృతి



జువ్వాల నూకరాజు

అచ్యుతాపురం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): దళిత ఉద్యమ నేత జువ్వాల నూకరాజు (75) సోమవారం మృతిచెందారు. మండలంలోని తట్టువానిపాలెంకి చెందిన నూకరాజు కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మరణించారు. ఆయన మృతి పట్ల పలు ప్రజాసంఘాలు, ప్రజా ప్రతినిధులు, దళిత సంఘాల నేతలు సంతాపం తెలిపారు.

ఫ్యాన్ మళ్లీ తిరగడం ఖాయం : ధర్మశ్రీ



సమావేశంలో మాట్లాడుతున్న కరణం ధర్మశ్రీ

మునగపాక, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఫ్యాన్ తాత్కాలికంగా ఆగినా.. మరల తిరగడం ఖాయమని వైసీపీ ఎలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ అన్నారు. మండలంలో వెంకటాపురం, టి.సిరసపల్లి, తోటాడ, గవర్ల అనకాపల్లి గ్రామాల్లో సోమవారం బాబు షూరిటీ-మోసం గ్యారంటీ పేరుతో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఉపాధి హామీ బకాయిలు వెంటనే చెల్లించకపోతే వైసీపీ ఆందోళన చేస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్, జెడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామిసత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యులు మద్దాల వీరునాయుడు, కాండ్రేగుల వెంకటలక్ష్మి, సర్పంచ్ సుందరపు నీలకంఠ స్వామి, వైసీపీ మండల అధ్యక్షుడు ఆడారి గణపతి అచ్చింనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

శ్రమదానంతో సాగునీటి కాలువను శుభ్రం



సాగునీటి కాలువలో తుప్పలను తొలగిస్తున్న రైతులు

మునగపాక, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మునగపాకలో రైతులు శ్రమదానంతో సాగు నీటి పిల్ల కాలువను సోమవారం శుభ్రం చేశారు. వరి నారుమడులు, ఉడుపులు మొదలు కావడంతో అవసరమైన సాగునీటి కోసం రైతులు కాలువలో తుప్పలు, మట్టిదిబ్బలను తొలగించారు. ఈ కార్యక్రమంలో రైతులు దాడి భాస్కరరావు, ఆళ్ల శ్రీను, పెంటకోట సత్యనారాయణ, దొడ్డి పరదేశిరావు తదితరులు పాల్గొన్నారు.

హోంమంత్రి పర్యటనను విజయవంతం చేయండి

ఎస్.రాయవరం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటాపురం గ్రామంలో మంగళవారం హోం మంత్రి వంగలపూడి అనిత పర్యటించనున్నారని టీడీపీ మండల అధ్యక్షుడు అమలకంటి అబద్ధం తెలిపారు. అన్నదాత సుఖీభవ కార్యక్రమాన్ని పురస్కరించుకొని ఎస్.రాయవరం నుంచి వెంకటాపురం వరకు 50 ట్రాక్టర్లు, ఎడ్ల బండ్లతో నిర్వహించే ర్యాలీలో హోం మంత్రి పాల్గొనడం జరుగుతుందన్నారు. అలాగే తరువాత వెంకటాపురంలో నూతనంగా నిర్మించిన రోడ్లు, టీడీపీ కార్యాలయాన్ని అనిత ప్రారంభిస్తారన్నారు. హోం మంత్రి పర్యటనను కూటమి నాయకులు, శ్రేణులు విజయవంతం చేయాలని కోరారు.

రక్తహీన రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలి

పాయకరావుపేట రూరల్, ఆగస్టు11 (ఆంధ్రజ్యోతి): రక్త హీన రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని శ్రీరాంపురం పీహెచ్‌సీ వైద్యాధికారిణి పి. కావ్య అన్నారు. సోమవారం నులి పురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా ఆమె వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. నులి పురుగుల నిర్మూలన గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ సందర్భంగా నులిపురుగుల వలన నష్టాలు, ఆరోగ్య సమస్యలపై పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ శ్రీరాంపురం పీహెచ్‌సీ పరిధిలో సుమారు 5,186 మంది పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలను వేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో రమణ, వైద్య సిబ్బంది ఎస్. రాజ్యలక్ష్మి, డి సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

సుందరపు, ప్రగడలను కలిసిన పీఏసీఎస్‌ల చైర్‌పర్సన్‌లు, డైరెక్టర్లు



ఎమ్మెల్యే విజయకుమార్‌ను కలిసిన నాగులాపల్లి, చూచుకొండ పీఏసీఎస్‌ల చైర్‌పర్సన్‌లు,డైరెక్టర్లు



ఆర్‌డీసీ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావును కలిసిన మునగపాక పీఏసీఎస్ చైర్‌పర్సన్, డైరెక్టర్లు

మునగపాక/అచ్యుతాపురం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావులను మండలానికి చెందిన పీఏసీఎస్ చైర్‌పర్సన్‌లు, డైరెక్టర్లు సోమవారం సత్కరించారు. అచ్యుతాపురంలో ఎమ్మెల్యే విజయకుమార్‌ను, ఆర్‌డీసీ చైర్మన్ నాగేశ్వరరావులను సోమవారం వేర్వేరుగా కలిశారు. విజయకుమార్‌ను నాగులాపల్లి, చూచుకొండ పీఏసీఎస్‌లు చైర్‌పర్సన్‌లు యల్లపు వెంకటభాస్కరరావు, పెంటకోట నర్సింగరావులు కలవగా ప్రగడ నాగేశ్వరరావును మునగపాక చైర్‌పర్సన్ విల్లూరి నూకనర్సింగరావు పర్సన్‌లతో వెళ్లి కలిశారు. ఈ కార్యక్రమాల్లో పీఏసీఎస్‌ల డైరెక్టర్లు సుందరపు శ్రీనివాసరావు, పాలిపిని రాము, కర్రి వెంకునాయుడు, మొల్లి అప్పలరాజు, పెంటకోట రఘురాం, కొంతం జగదీశ్వరరావు, టీడీపీ, జనసేన పార్టీ నాయకులు పాల్గొన్నారు.

శక్తి యాప్‌పై అవగాహన



విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ట్రైనీ ఎస్ఐ షాహెబా అంజుమ్

నక్కపల్లి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): నక్కపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుకుంటున్న విద్యార్థినులకు సోమవారం ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శివయ్య ఆధ్వర్యంలో పలు అంశాలపై అవగాహన కల్పించారు. శక్తి యాప్ గురించి ట్రైనీ ఎస్ఐ షాహెబా అంజుమ్ బాలికలకు అవగాహన కల్పించారు. బయటకు వెళ్లినప్పుడు విద్యార్థినులు ధైర్యంగా వుండాలని, ఎవరైనా ఈవ్‌టీజింగ్‌కు పాల్పడినా, ఇబ్బందికరంగా ప్రవర్తించినా శక్తి యాప్ ద్వారా ఎలా సాయం పొందాలో వివరించారు. బాల్య వివాహాలు చేసుకోవడం వల్ల ఆడపిల్లల జీవితాలు నాశనమవుతాయన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు పంపే లింకులను ఓపెన్ చేయకూడదని సూచించారు. జిల్లా బాలికా సంరక్షణ సమితి ప్రతినిధి డి.లోవరాజు, కె.కాశీలక్ష్మి,గాయత్రి, పరమేశ్వరి పాల్గొన్నారు.

బాపన్న చెరువులో అభివృద్ధి పనులు

▸ అడ్డుకున్న ఆక్రమణదారులు

▸ రెవెన్యూ అధికారుల జోక్యంతో ఆక్రమణల తొలగింపు



రాజవరం సమీపంలోని బాపన్న చెరువులో ఆక్రమణలు తొలగిస్తున్న దృశ్యం

పాయకరావుపేట రూరల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి):మండలంలోని రాజవరం సమీపంలో ఉన్న బాపన్న చెరువులో రాజవరం రైతులు, గ్రామస్థులు డెక్కన్ సహకారంతో సోమవారం అభివృద్ధి పనులు చేపట్టారు. మూడు ఎకరాల విస్తీర్ణంలో ఉన్న బాపన్న చెరువు కింద 40 ఎకరాలు ఆయకట్టు సాగవుతున్నట్టు రాజవరం కాలువ చైర్మన్ పిరుమళ్ల గోవిందు, టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి బొంది కాశీవిశ్వనాథ్ తెలిపారు. కొంతమంది రైతులు చెరువును ఆక్రమించుకుని షెడ్లు నిర్మించుకున్నారని వారు ఆరోపించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత సాగునీటి కాలువలు, చెరువుల్లో అభివృద్ధి పనులను చేపట్టామన్నారు. చెరువులో అభివృద్ధి పనులకు ఆక్రమణదారులు అడ్డుకోవడంతో కాలువ చైర్మన్ గోవిందు, బొంది కాశీవిశ్వనాథ్, తాతీలు, తాతారావు, మోహన్ రమణ తదితరులు తహశీల్దారు మహేశ్వరరావుకు, పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో తహశీల్దారు ఆదేశం మేరకు రెవెన్యూ సిబ్బంది సర్వే చేసి హద్దులు నిర్ణయించారు. అనంతరం ఆక్రమణలు తొలగించారు. చెరువును సుందరంగా తీర్చిదిద్దుతామని వారు తెలిపారు.

ఎలమంచిలిలో విద్యుత్ సరఫరా నిలిపివేత రేపు

ఎలమంచిలి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఈనెల 13వ తేదీ బుధవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ ఎలమంచిలి పట్టణంతోపాటు మండలంలోనూ విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈపీడీసీఎల్ అనకాపల్లి ఈఈ రాజశేఖర్ తెలిపారు. ఆర్‌డీఎస్ఎస్ పనుల్లో భాగంగా ఎలమంచిలి పట్టణం(ఏజిఎల్), కొత్త ఎర్రవరం, ఎలమంచిలి వై జంక్షన్, నుంచి అచ్యుతాపురం రోడ్డు వరకూ. ధర్మవరం, సైతారుపేట రోడ్డు, సోమలింగపాలెం, కట్టుపాలెం, రామారాయుడుపాలెం, కొత్తపాలెం, మండలంలోని పులపర్తి, పేట బయ్యవరం, లక్కవరం, క్రిష్టాపురం, నాయనమ్మపాలెం, రుక్మిణిపురం ప్రాంతాల్లో ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు గమనించాలని తెలిపారు.

పైడమ్మ చెరువును గ్రామ ఆధీనంలోనే ఉంచాలి

డీజీఎన్‌పీ ప్రతినిధికి స్పష్టం చేసిన వాడనర్సాపురం గ్రామస్థులు



డీజీఎన్‌పీ ప్రతినిధికి వినతిపత్రాన్ని అందజేస్తున్న మత్స్యకార నాయకులు

రాంబిల్లి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): గ్రామాన్ని తరలించేంతవరకు పైడమ్మ చెరువును గ్రామ ఆధీనంలోనే ఉంచాలని వాడనర్సాపురం గ్రామ పెద్దలు సోమవారం గ్రామానికి వచ్చిన డీజీఎన్‌పీ ప్రతినిధి ఎస్.రామన్నపాత్రుడుకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ చెరువులో మత్స్యకార కుటుంబాలు చేపల వేట సాగించుకొని జీవనం సాగిస్తున్నాయని పేర్కొన్నారు. రెవెన్యూ అధికారులు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా, ప్రజాభిప్రాయ సేకరణ చేయకుండా ఈ చెరువును నేవీ వారికి అప్పగించడం జరిగిందన్నారు. ఎన్ఏఓబీ ఏర్పాటుతో సముద్రంలో చేపల వేట సాగకపోవడంతో ఈ చెరువే మత్స్యకార కుటుంబాలను ఆదుకుంటుందన్నారు. రైతులకు సాగు నీరు, పశువుల దాహార్తిని ఈ చెరువు తీరుస్తుందన్నారు. గ్రామాన్ని తరలించేంతవరకు ఈ చెరువు జోలికి రావద్దని, అధికారులు బలవంతాన చెరువును స్వాధీనం చేసుకోవడానికి వస్తే గ్రామస్థులమంతాఅడ్డుకుంటామని ఆయనకు స్పష్టం చేశారు. ఈ వినతిపత్రం ఇచ్చిన వారిలో సర్పంచ్ కారేరామారావు, మాజీ సర్పంచ్ చింతకాయల ఎర్రయ్య, ఎంపీటీసీ మాజీ సభ్యుడు కొవిరి సోమేశ్వరరావు, బీజేపీ మండల అధ్యక్షుడు కారే రాముడు, తదితరులు ఉన్నారు.

ప్రతి ఇంట్లో జాతీయ పతాకం ఎగరాలి : ఎంపీడీవో



ఎంపీడీఓ కార్యాలయం వద్ద మానవహారంగా ఏర్పడిన దృశ్యం

అచ్యుతాపురం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): పంద్రాగస్టుకి ప్రతి ఇంట్లో జాతీయ జెండా ఎగరాలని ఎంపీడీఓ శ్రీనివాస్ అన్నారు. సోమవారం మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో జాతీయ పతాకాలతో ర్యాలీతోపాటు మానవహారంగా ఏర్పడి హర్ గర్ తిరంగ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పీ 4 జీరో ప్రాపర్టీ బంగారు కుటుంబాలు, మార్గదర్శకుల వివరాలు ఎలా అప్‌లోడ్ చేయాలో శిక్షణ పొందాలన్నారు. అంతకుముందు మండల సమాఖ్య భవనం నుంచి త్రివర్ణ పతాకాలతో అచ్యుతాపురం జంక్షన్ వరకు ర్యాలీని నిర్వహించారు. ఈకార్యక్రమంలో వెలుగు ఏపీఎం శ్రీనివాసరావు, సీసీలు నాగరాజు, రాంబాబు, దేముడు, సరోజిని, పద్మావతి పాల్గొన్నారు.

పాయకరావుపేటలో..

స్వాతంత్ర్య దినోత్సవంపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు సోమవారం హర్ ఘర్ తిరంగ ర్యాలీని ఘనంగా నిర్వహించారు. ఎంపీడీఓ ఎ.జయప్రకాశరావు ఆధ్వర్యంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయం నుంచి పట్టణంలో వివిధ కాలనీల్లో నిర్వహించిన ఈ ర్యాలీలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొని స్వాతంత్ర్య దినోత్సవం ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయ ఏఓ సీహెచ్‌ఆర్‌కే.వర్మ తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీకి కొత్త హంగులు

▸ 13న హోం మంత్రి అనిత ప్రారంభం



కేజీబీవీలో కొత్తగా నిర్మించిన లైబ్రేరీ రూమ్

నక్కపల్లి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): నక్కపల్లి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయానికి (కేజీబీవీ) కొత్త సదుపాయాలు కల్పించారు. సమగ్ర శిక్షా విభాగం నిధులు రూ. 41.6లక్షలతో కేజీబీవీలో కంప్యూటర్ ల్యాబ్, నూతన లైబ్రేరీ రూమ్‌ను నిర్మించారు. వీటిని ఈనెల 13న హోం మంత్రి వంగలపూడి అనిత ప్రారంభిస్తారని కేజీబీవీ ఎస్‌వో సలీమా సోమవారం స్థానిక విలేకర్లకు చెప్పారు. ప్రారంభోత్సవం అనంతరం ల్యాబ్‌లో కంప్యూటర్లు ఏర్పాటు చేస్తామని ఎస్‌వో చెప్పారు.

ఆకట్టుకున్న శ్రీకృష్ణుడు హరికథ

మునగపాక, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన హరికథ ప్రేక్షకులను అమితంగా ఆకట్టుకుంది. మండలంలో గవర్లఅనకాపల్లి గ్రామంలో సోమవారం ఆళ్ల వెంకటరావు,వెంకటలక్ష్మి దంపతులు ఆధ్వర్యంలో శ్రీకృష్ణ నవరాత్రి వేడుకలు జరిగాయి. వేడుకల్లో భాగంగా ప్రముఖ హరికథా కళాకారిణి కె.కల్యాణి శ్రీకృష్ణ జననం కథనం వినిపించారు.

ప్రమాదకరంగా అధికలోడు వాహనాలు

▸ ఇబ్బంది పడుతున్న ఇతర వాహనదారులు



లైనుకొత్తూరు రోడ్డుపై అధికలోడుతో వెళుతున్న ట్రాక్టర్

ఎలమంచిలి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి పట్టణ రహదారులపై కొందరు వాహనదారులు అధికలోడుతో వాహనాలను ఇష్టానుసారంగా నడుపుతున్నారు. దీంతో మిగిలిన వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సింగిల్ రోడ్లపై అధికంగా లోడు చేసుకుని రాకపోకలు సాగిస్తుండడంతో ఇతర వాహనదారులు ఎదుటి వాహనాన్ని గుర్తించక ప్రమాదాలు చోటుచేసుకునే ప్రమాదం ఉందని పలువురు వాపోతున్నారు. ఇటీవల కొన్ని రోజులుగా పట్టణంతో పాటు మండలంలోని ప్రధాన రోడ్లపై సైతం ట్రాక్టర్లు, ఆటోలు, లారీలపై అధికంగా లోడు చేసుకుని రాకపోకలు సాగిస్తున్న వాహనాలు సంఖ్య పెరుగుతోంది. ఈ వాహనాలపై పోలీసులు నిఘా ఉంచి ప్రమాదాలు చోటుచేసుకోకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

అంతర్రాష్ట్ర ఖోఖో పోటీల్లో సత్తాచాటిన శ్రీప్రకాష్ విద్యార్థులు

▸ అండర్-17,-14 విభాగాల్లో ప్రథమ స్థానం కైవసం



అండర్-17 విభాగం ఖోఖో పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన శ్రీప్రకాష్ బాలికలు

పాయకరావుపేట, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో జరుగుతున్న సీబీఎస్ఈ క్లస్టర్-7 అంతర్రాష్ట్ర ఖోఖో పోటీల్లో శ్రీప్రకాష్ విద్యా నికేతన్ విద్యార్థులు పలు విభాగాల్లో ప్రథమ స్థానంలో నిలిచి సత్తాచాటారు. సోమవారం జరిగిన హోరాహోరీ ఫైనల్స్‌లో అండర్-17 బాలురు, బాలికల విభాగాలతోపాటు అండర్-14 బాలికల విభాగంలో శ్రీప్రకాష్ విద్యా నికేతన్ జట్లు ప్రథమ స్థానం సాధించాయి. ఫైనల్స్‌లో అండర్-19 బాలికల విభాగంలో సిస్టర్ నివేదిత స్కూల్(హైదరాబాద్) జట్టు గెలుపొంది ప్రథమస్థానం సాధించగా.. వెరిటాస్ సైనిక్ స్కూల్(తిరుపతి) జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. అదేవిధంగా బాలుర విభాగంలో వెరిటాస్ సైనిక్ స్కూల్(తిరుపతి) విజేతగా నిలువగా మొదటి స్థానం కైవసం చేసుకోగా ఫార్చ్యూన్ బటర్‌ఫ్లై స్కూల్(మహబూబ్‌నగర్) ద్వితీయ స్థానంలో నిలిచింది. అండర్-17 బాలురు, బాలికల విభాగాల్లో శ్రీప్రకాష్ విద్యా నికేతన్(పాయకరావుపేట) జట్లు విజయం సాధించి ప్రథమ స్థానాల్లో నిలవగా, బాలుర విభాగంలో ఎకార్డ్ స్కూల్(తిరుపతి), బాలికల విభాగంలో మాంటిస్సోరి ఎలైట్ ఇంగ్లీషు మీడియం స్కూల్(అనంతపూర్) ద్వితీయ స్థానంలో నిలిచాయి. ఇక అండర్-14 బాలుర విభాగంలో శ్రీప్రకాష్ విద్యా నికేతన్(పాయకరావుపేట) జట్టు ప్రథమ స్థానం, ఏకశిల ఇంటర్నేషనల్ స్కూల్(మెహబూబ్‌నగర్) జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. బాలికల విభాగంలో హీల్ స్కూల్(కృష్ణా జిల్లా) జట్టు విజయం సాధించి ప్రథమ స్థానం సాధించగా, సూర్య అకాడమీ స్కూల్ (హైదరాబాద్) ద్వితీయ స్థానంలో నిలిచింది. అనంతరం జరిగిన ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్.విజయ్‌ప్రకాష్ పోటీల్లో మొదటి రెండు స్థానాల్లో నిలిచిన జట్లకు మెడల్స్, షీల్డ్‌లు అందజేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో ప్రతిభ కనబరిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. అనంతరం జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యారులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీబీఎస్ఐ పరిశీలకులు సీహెచ్ఎల్ఎం.శ్రీనివాస్, సీనియర్ ప్రిన్సిపాల్ ఎంవీవీఎస్.మూర్తి, వైఎస్ ప్రిన్సిపాల్ అపర్ణ, కోచ్‌లు, మేనేజర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



అండర్-17 విభాగంలో ప్రథమ స్థానం సాధించిన శ్రీప్రకాష్ బాలురు

మార్గదర్శకుల గుర్తింపును వేగవంతం చేయాలి

▸ పీఎం సూర్యఘర్‌పై అవగాహన కల్పించండి

▸ అన్ని మండల కేంద్రాల్లో వాలీబాల్ కోర్టులు : కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్, చిత్రంలో జేసీ

అనకాపల్లి కలెక్టరేట్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): బంగారు కుటుంబాలు, మార్గదర్శకుల గుర్తింపును వేగవంతం చేయాలని కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. సోమవారం మధ్యాహ్నం కలెక్టరేట్ నుంచి జిల్లా, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి 'పీ4- బంగారు కుటుంబం' కార్యక్రమం పురోగతిని, ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం అమలు గురించి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ధనవంతుల స్వచ్ఛంద మద్దతు ద్వారా సమాజంలో పేదరిక నిర్మూలన లక్ష్యంగా పెట్టుకున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసి రాష్ట్రంలో అనకాపల్లి జిల్లాను మొదటిస్థానంలో ఉంచడానికి కృషి చేయాలన్నారు. ఆర్థిక అభ్యున్నతి లక్ష్యంగా బంగారు కుటుంబాల ఎంపిక జరగాలని ఉద్ఘాటించారు. వినియోగదారులకు విద్యుత్ ఖర్చులను తగ్గించడమే ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం లక్ష్యం కనుక ప్రతి కుటుంబం ఈ పథకం నుంచి ప్రయోజనం పొందేలా విస్తృత ప్రచారం, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆమె కోరారు.

మండల కేంద్రాల్లో వాలీబాల్ కోర్టులు

జిల్లాలోని ప్రతి మండల కేంద్రంలో వాలీబాల్ కోర్టులు ఏర్పాటు చేయాలని కలెక్టర్ విజయకృష్ణన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో జరిగిన జిల్లాస్థాయి క్రీడాభివృద్ధి సమావేశంలో మాట్లాడుతూ అన్ని మండల కేంద్రాల్లో 20 సెంట్ల చొప్పున భూమిని సేకరించి వాలీబాల్ కోర్టుల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాలని జడ్పీ సీఈవోను ఆదేశించారు. ప్రతిభ కలిగిన క్రీడాకారులకు సరైన ప్రోత్సాహం అందిస్తే అద్భుతంగా రాణిస్తారన్నారు. సమావేశంలో జేసీ జాహ్నవి, జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎల్.వెంకటరమణ పాల్గొన్నారు.

గౌరీ పంచాయతన ఆలయంలో కుంకుమార్చనలు



అమ్మవారికి కుంకుమార్చనలు జరుపుతున్న భక్తులు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని గౌరీ పంచాయతన ఆలయంలో గౌరీపరమేశ్వరీ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠా వార్షికోత్సవాన్ని సోమవారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజామున అర్చకులు అమ్మవారిని విశేషంగా అలంకరించి పూజలు చేపట్టారు. అనంతరం ఆలయ మండపంలో దంపతులతో సామూహిక కుంకుమార్చనలు జరిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో గౌరీ సేవా సంఘం అధ్యక్షులు కర్రి సన్యాసినాయుడు, కార్యదర్శి బొడ్డేడ రామ సత్యనారాయణ, కోశాధికారి శరగడం జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులను పరిశీలించిన జడ్సీ



జోనల్ కార్యాలయంలో కంపోస్టుయార్డును పరిశీలిస్తున్న జడ్సీ చక్రవర్తి

అనకాపల్లి టౌన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ జోనల్ కమిషనర్ కె.చక్రవర్తి సోమవారం పట్టణంలో విస్తృతంగా పర్యటించారు. తెల్లవారుజామున ఆరు గంటలకే రోడ్డుపైకి వచ్చి పారిశుధ్య మెరుగు పనులను పరిశీలించారు. రింగురోడ్డు జంక్షన్‌లోని డ్రైన్‌లో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని సిబ్బందితో దగ్గరుండి తొలగింపజేశారు. అన్న క్యాంటీన్‌లను పరిశీలించారు. నాణ్యతతో కూడిన అల్పాహారం, భోజనాలను వడ్డించాలని నిర్వాహకులకు సూచించారు. అనంతరం జోనల్ కార్యాలయం ఆవరణలో ఉన్న చెత్తను పరిశీలించారు. కార్యాలయానికి వచ్చే వారికి చెత్త కనిపించకుండా ఉండేలా తగు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈయన వెంట శానిటేషన్ విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వేణుగోపాల ఆలయ భూముల కౌలుకు వేలం రేపు

కశింకోట, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడున్న వేణుగోపాలస్వామి ఆలయ భూముల కౌలుకు బుధవారం బహిరంగ వేలం నిర్వహించనున్నామని సత్యనారాయణస్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారి సత్యనారాయణమూర్తి తెలిపారు. వెదురుపర్తి గ్రామంలో ఉన్న 7.54 ఎకరాల భూమికి ఆరోజు ఉదయం పదకొండు గంటలకు కశింకోటలో గల స్వామివారి దేవస్థానంలో ఈ వేలం పాట జరుపుతామన్నారు. దేవాలయానికి ఏ విధమైన బకాయిలున్న వారు, ఇతర ఎటువంటి లావాదేవీలు ఉన్నవారు పాటలో పాల్గొనేందుకు అనర్హులుగా పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని హిందూమతానికి చెందిన వారు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు.

అదనపు లోడ్ క్రమబద్ధీకరణకు గడువు పెంపు

అనకాపల్లి కలెక్టరేట్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : గృహ వినియోగదారులు అదనపు లోడ్ క్రమబద్ధీకరణకు గడువును ఈ ఏడాది డిసెంబరు 31వ తేదీ వరకు పొడిగించినట్టు ఈపీడీసీఎల్ ఎస్ఈ జి.ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అదనపు లోడు క్రమబద్ధీకరణకు ప్రభుత్వం డెవలప్‌మెంట్ చార్జీల్లో 50 శాతం రాయితీ ఇస్తూ అవకాశం కల్పించినట్టు వివరించారు. గృహ వినియోగదారులు స్వచ్ఛందంగా క్రమబద్ధీకరించుకొని రాయితీ పొందాలని పేర్కొన్నారు. రాయితీ ద్వారా లభించే ఆర్థిక ప్రయోజనాలపై జిల్లాలోని అన్ని సెక్షన్, సబ్ డివిజన్ల పరిధిలో ప్రచారం చేయాలని అధికారులను ఆదేశించారు.

81 మంది రాంకీ ఫౌండేషన్ సిబ్బంది రక్తదానం



రక్తదానం చేస్తున్న రాంకీ ఫౌండేషన్ సిబ్బంది

పరవాడ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : రక్తదానం ప్రాణదానంతో సమానమని రోటరీ క్లబ్ ఛైర్మన్ కె.శ్రీనివాసరావు అన్నారు. రాంకీ ఫౌండేషన్ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం ఫార్మాసిటీ హబ్‌లో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ ఏడాదికి రెండు దఫాలు రక్తదానం చేయవచ్చునన్నారు. ఈ శిబిరంలో 81 మంది రాంకీ ఉద్యోగులు, కార్మికులు రక్తదానం చేశారు. అనంతరం దాతలకు రోటరీక్లబ్ తరఫున జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాంకీ ఫౌండేషన్ డిప్యూటీ హెడ్ కె.శ్రీకాంత్, విశాఖ ఫార్మాసిటీ హెచ్ఆర్ ప్రతినిధి ఆర్.భరత్‌కుమార్, రాంకీ ఫౌండేషన్ సిబ్బంది, విశాఖ ఫార్మాసిటీ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదాతకు అండగా ప్రభుత్వం

▸ ఏడాది పాలనలో ఎన్నెన్నో పథకాలు ▸ 14న రైతు యాత్ర పేరిట ట్రాక్టర్ ర్యాలీ ▸ విజయవంతానికి ఎమ్మెల్యే కొణతాల పిలుపు



యువగళం పుస్తకాన్ని కొణతాలకు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే పీలా, డీసీఎంఎస్ ఛైర్మన్ బాలాజీ

కొత్తూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : రైతులకు అన్నింటా అండగా నిలిచేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అన్నారు. అనకాపల్లి పట్టణంలోని రింగురోడ్డులో గల జనసేన కార్యాలయంలో సోమవారం కూటమి నాయకులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ పథకం, తల్లికి వందనం, ఉచిత గ్యాస్ సిలెండర్లు, అన్న క్యాంటీన్లు వంటి పథకాలు అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే అమలు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. రాష్ట్రాభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. కాగా, కూటమి ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రవేశపెట్టిన అన్నదాత సుఖీభవ పథకంపై ఈ నెల 14న రైతు యాత్ర పేరిన ట్రాక్టర్లతో ర్యాలీ చేపట్టనున్నామని కొణతాల వివరించారు. ఈ యాత్ర ఎన్టీఆర్ బెల్లం మార్కెట్ నుంచి ప్రారంభమై నెహ్రూ చౌక్ కూడలి వరకు కొనసాగుతుందన్నారు. ఈ ప్రాంత క్లస్టర్ ఇన్‌చార్జిలు, కూటమి నాయకులు, రైతులు, నీటి సంఘాల ఛైర్మన్లు, డైరెక్టర్లు హాజరై విజయవంతం చేయాల్సిందిగా కోరారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే, అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, గవర కార్పొరేషన్ ఛైర్మన్ మళ్ల సురేంద్ర, నూకాంబిక అమ్మవారి ఆలయ మాజీ ఛైర్మన్ పీలా నాగశ్రీనులతో పాటు పలువురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

కొణతాలకు యువగళం పాదయాత్ర పుస్తకం అందజేత

కొత్తూరు : టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మంత్రి నారా లోకేశ్ పంపిన యువగళం పాదయాత్ర పుస్తకాన్ని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణకు మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, డీసీఎంఎస్ ఛైర్మన్ కోట్ని బాలాజీ ఇక్కడ అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువగళం పాదయాత్ర దేశ రాజకీయ చరిత్రలోనే కీలక ఘట్టమన్నారు. యువగళం పాదయాత్రలో ప్రజల కష్టాలను లోకేశ్ చూశారని, అందుకే అధికారంలోకి రాగానే అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారన్నారు. అంతకుముందు వారు నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

సమస్యలపై మధ్యాహ్న భోజన పథకం కార్మికుల ఆందోళన



సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేస్తున్న పథకం నిర్వాహకులు

పరవాడ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మధ్యాహ్న భోజన పథకం కార్మికులు సోమవారం మండలంలోని వాడచీపురుపల్లిలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం మండల అధ్యక్షురాలు కె.ఆదిలక్ష్మి మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం రూ.10 వేలు చెల్లించాలని, బిల్లులు సక్రమంగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అలాగే, పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయం కల్పించాలని, వంటకు సంబంధించిన పెట్టుబడి నగదు ముందుగానే ఇవ్వాలని, గుర్తింపు కార్డులు, యూనిఫారాలు అందజేయాలని నినాదాలు చేశారు. ఈ ఆందోళన కార్యక్రమంలో సంఘం మండల గౌరవాధ్యక్షురాలు పి.మాణిక్యం, ప్రతినిధులు జి.లక్ష్మి, కె.రత్నకుమారి, పి.నాగమణి తదితరులు పాల్గొన్నారు.

భూసేకరణ ప్రతిపాదన విరమించాలి

▸ బుచ్చెయ్యపేట మండలంలోని మూడు గ్రామాల రైతుల డిమాండ్

▸ రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా



ఆందోళన చేస్తున్న ఆర్.భీమవరం, ఆర్.శివరామపురం, మల్లాం గ్రామాల రైతులు

అనకాపల్లి రూరల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): బుచ్చెయ్యపేట మండలంలోని ఆర్.భీమవరం, ఆర్.శివరామపురం, మల్లాం పంచాయతీల్లో భూసేకరణ ప్రతిపాదనలను వ్యతిరేకిస్తూ రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట రైతులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి దంతులూరి వర్మ మాట్లాడుతూ, చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు, బుచ్చెయ్యపేట తహసీల్దార్, జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి భూసేకరణ ప్రతిపాదనను వెనక్కి తీసుకుంటున్నట్టు ప్రకటించాలని డిమాండ్ చేశారు. అభివృద్ధి పేరుతో ప్రజల జీవనోపాధిని దెబ్బతీసే బలవంతపు భూసేకరణను నిలిపివేయాలన్నారు. కార్పొరేట్ కంపెనీలను, పారిశ్రామికవేత్తలకు చౌకగా భూములు ఇచ్చేందుకు రైతుల నుంచి భూములను లాక్కుంటున్నారని ఆయన ఆరోపించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ జాహ్నవిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి కోన మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ

▸ డీఎంహెచ్ఓ డాక్టర్ ఎం.హైమావతి



డాక్టర్ హైమావతి, డీఎంహెచ్ఓ

అనకాపల్లి టౌన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం జిల్లా వ్యాప్తంగా ఒకటి నుంచి 19 ఏళ్లలోపు వారికి ఆల్బెండజోల్ మాత్రలను ఉచితంగా ఇస్తామని డీఎంహెచ్ఓ డాక్టర్ ఎం.హైమావతి తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలు, అన్ని యాజమాన్యాల పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులకు ఈ మాత్రలను ఉచితంగా ఇస్తామన్నారు. రెండేళ్ల లోపు వయసుగల పిల్లలకు సగం మాత్రను నీటిలో కరిగించి తాగించాలన్నారు. రెండు నుంచి 19 ఏళ్ల వయసుగల వారు పూర్తి మాత్రను మధ్యాహ్నం భోజనం చేసిన అరగంట తరువాత చప్పరించాలని సూచించారు.

అనకాపల్లి టౌన్ : జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని అంతా విజయవంతం చేయాలని జోనల్ కమిషనర్ కె.చక్రవర్తి పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా సోమవారం వైద్య సిబ్బందితో కలిసి పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఒకటి నుంచి 19 సంవత్సరాలలోపు పిల్లలు, కిశోర బాలికలకు ఆల్‌బెండ్‌జోల్ మాత్రలను పాఠశాలలు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉచితంగా ఇవ్వనున్నట్టు చెప్పారు.

గోవాడ షుగర్ ఫ్యాక్టరీని ఆదుకోవాలని ధర్నా

అనకాపల్లి కలెక్టరేట్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : కష్టాల్లో ఉన్న గోవాడ షుగర్ ఫ్యాక్టరీని ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ఎదుట సదరు ఫ్యాక్టరీ రైతులు, కార్మికులు, నాయకులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి నాయకులు ఇచ్చిన హామీ మేరకు ఫ్యాక్టరీని ఆదుకోవాలని, గత సీజన్‌లో బకాయిన పడిన రూ.30 కోట్లను వెంటనే చెల్లించాలని కోరారు. అలాగే, ఆధునికీకరణకు వంద కోట్ల రూపాయలను మంజూరు చేసి, రాష్ట్రంలో ఉన్న ఏకైక ఈ సహకార చక్కెర కర్మాగారాన్ని కాపాడాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సంస్కృత భాషపై అవగాహన ర్యాలీ



కన్నూరుపాలెంలో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

కశింకోట, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : సంస్కృత సప్తాహ వారోత్సవాల్లో భాగంగా కన్నూరుపాలెంలో గల సంస్కృత భారతీ శిక్షణ బాల కేంద్రం ఆధ్వర్యంలో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. బాలకేంద్రం పిల్లలు భగవద్గీత, సంస్కృత భాషపరిచయం, అభ్యాసం, అభినయ గీతాలను ఆలపించారు. సంస్కృత భారతి కార్యకర్త రామ్‌కుమార్ మహోదయ సంస్కృతం విశిష్టతను వివరించారు. ఈ కార్యక్రమంలో కేంద్రం నిర్వాహకులు గాయత్రీదేవి, శోభాదేవి తదితరులు పాల్గొన్నారు.

కన్నూరుపాలెం రహదారిపై వాహన తనిఖీలు



చెక్ పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు, ఆర్టీవో అధికారులు

కశింకోట, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కన్నూరుపాలెం ప్రధాన రహదారిపై ఉన్న చెక్‌పోస్టు వద్ద సీఐ అల్లు స్వామినాయుడు, మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎంవీఎం కాశీవిశ్వనాథ్ సోమవారం రాత్రి వాహన తనిఖీ నిర్వహించారు. పలు వాహనాలకు సంబంధించిన పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ మార్గంలో అధిక బరువుతో వాహనాలు రాకపోకలు సాగిస్తే చర్యలు తప్పవని వాహన చోదకులను హెచ్చరించారు.

21న జిల్లా సమాచార శాఖ వాహనం వేలం

అనకాపల్లి రూరల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లా సమాచార, పౌర సంబంధాల శాఖ కార్యాలయంలోని వీడియో కవరేజ్ వాహనానికి ఈనెల 21వ తేదీ ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం నిర్వహించనున్నామని జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి ఎస్.వి.రమణ సోమవారం తెలిపారు. కాల పరిమితి ముగిసి, నిరుపయోగంగా ఉన్న మహీంద్రా నిస్సాన్ (ఏపీ 31టీ 5083) 1993 మోడల్ వాహనాన్ని బహిరంగ వేలం వేసేందుకు నిర్ణయించామని పేర్కొన్నారు. వేలం పాటలో పాల్గొనదలచినవారు రూ.వెయ్యి ధరావత్తు సొమ్ము చెల్లించవలసి ఉంటుందన్నారు. వేలం దక్కించుకున్న వారు జీఎస్టీతో సహా మొత్తం నగదు వెంటనే చెల్లించాలని తెలిపారు. వాహనాన్ని కార్యాలయ పని వేళల్లో పరిశీలించ వచ్చునన్నారు. వేలం వేయడం, రద్దు చేసే అధికారం కార్యాలయ అధికారికి ఉందని స్పష్టం చేశారు. మరిన్ని వివరాలకు 91004 42488 నంబరులో సంప్రదించాల్సిందిగా కోరారు.

అయినవారున్నా అనాథాశ్రమానికి వృద్ధురాలు



వృద్ధురాలిని ఆశ్రమానికి తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్న జనసేన నాయకుడు రామచంద్రరావు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : కన్నవారు ఉన్నా.. ఆమె ఓ అనాథ. వయస్సు పైబడడంతో అడుగుతీసి అడుగు వేయలేని దుస్థితి. దీనికితోడు పక్షవాతం మరింత కృంగదీసింది. ఇటువంటి తరుణంలో ప్రభుత్వం ఇచ్చే రూ.నాలుగు వేల పింఛనే ఆధారమైంది. గత్యంతరం లేక ఓ మహిళ ఇంటి వద్ద తలదాచుకుంటూ జీవనం సాగిస్తుండేది. ఈ వృద్ధురాలి దుస్థితిని తెలుసుకున్న జనసేన నాయకుడి చొరవతో ఎట్టకేలకు అనాథాశ్రమానికి చేరుకుంది. ఇందుకు సంబంధించి ఆపార్టీ నాయకులు తెలిపిన వివరాలివి.

పట్టణంలోని 82వ వార్డు అంజయ్య కాలనీలో కొవ్వాడ ఉమామహేశ్వరి అనే వృద్ధురాలు ఉంటోంది. ఈమెకు కొడుకు, కోడలు ఉన్నారు. గతంలో ఈమె చెన్నైలో ఉద్యోగం చేసేది. అనకాపల్లితో పాటు చెన్నైలో కూడా ఇళ్లు ఉండేవి. వాటిని విక్రయించగా, ఆ డబ్బుతో కొడుకు, కోడలు చెన్నైలో ఉండిపోయారు. నాటి నుంచి ఈమెను అనాథగా వదిలేశారు. వయస్సు మీరడంతో అనారోగ్య సమస్యలు పీడిస్తుండగా, పక్షవాతం తోడైంది. కదలేని స్థితిలో ఉన్న ఈమెకు ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన రూ.నాలుగు వేలే ఆధారం. ఆ డబ్బులను అంజయ్య కాలనీలో ఉంటున్న ఓ మహిళకు నెల నెలా ఇవ్వడంతో ఈమె ఆలనాపాలనా మొత్తం ఆ మహిళే చూసుకుంటోంది. ఈమె తన దుస్థితిని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి భీమరశెట్టి రామకృష్ణ (రాంకీ)కి ఫోన్ మెసేజ్ రూపంలో తెలియజేసింది. వెంటనే ఆయన స్పందించారు. ఈ వృద్ధురాలికి సహకారం అందించాలని 82వ వార్డు జనసేన ప్రతినిధి ఆళ్ల రామచంద్రరావుకు సూచించారు. విషయం తెలుసుకున్న రామచంద్రరావు ఆమె ఉంటున్న ఇంటికి వెళ్లారు. వృద్ధాశ్రమంలో చేర్పించాలని సంకల్పించారు. వెంకుపాలెం గల వృద్ధాశ్రమాన్ని సంప్రదించగా అక్కడ ఎవరి పనులు వారు చేసుకునే అవకాశం ఉన్నవారిని మాత్రమే చేర్పించుకుంటామని నిర్వాహకులు బదులిచ్చారు. దీంతో ఈ విషయాన్ని రాంకీ దృష్టికి తీసుకు వెళ్లడంతో ఆయన పట్టణ సీఐ టీవీ విజయ్‌కుమార్‌తో మాట్లాడారు. పెందుర్తిలో ఉన్న అనాథ ఆశ్రమం నిర్వాహకులతో సీఐ మాట్లాడారు. సోమవారం ఆమెను ఆటో ఎక్కించి పెందుర్తిలోని అనాథ ఆశ్రమానికి తరలించారు. దీంతో వృద్ధురాలి కష్టాలకు తెరపడినట్లైంది. ఈ కార్యక్రమంలో ఆళ్ల రామచంద్రరావుతో పాటు మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ ఎన్వీ కృష్ణ, బుద్ధ రాంబాబు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి యోగా పోటీల్లో డిగ్రీ విద్యార్థినికి ద్వితీయ స్థానం



జయలక్ష్మికి జ్ఞాపిక అందజేస్తున్న ప్రిన్సిపాల్

సబ్బవరం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : యోగా సమాఖ్య ఆధ్వర్యంలో ఆదివారం విశాఖపట్నంలో నిర్వహించిన జిల్లాస్థాయి యోగా పోటీల్లో సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న పండూరి జయలక్ష్మి ద్వితీయ స్థానం సాధించింది. ఈ సందర్భంగా ఆమెను కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ బి.శంకర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ లెక్కల గణేశ్, అధ్యాపకులు ఎంవీ రామకృష్ణ తదితరులు అభినందించారు.

'మల్లోడి గెడ్డవాగులో వ్యర్థ జలాలను తోడించాలి'

పరవాడ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం పరవాడ నుంచి భరణికం వెళ్లే ప్రధాన రహదారికి ఆనుకొని ఉన్న మల్లోడి గెడ్డలో పేరుకుపోయిన ఫార్మా వ్యర్థ జలాలను మోటారు సాయంతో తోడించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మల్లోడి గెడ్డవాగులో గల ఫార్మా వ్యర్థ జలాలను పరిశీలించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. రాంకీ యాజమాన్యం ఫార్మా వ్యర్థ జలాలను శుద్ధి చేయకుండా నేరుగా మల్లోడి గెడ్డవాగులోకి విడిచిపెట్టడంతో పూర్తిగా కలుషితమైపోయిందన్నారు. దీనివల్ల భూగర్భ జలాలకు ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యర్థ జలాలను సీఈటీపీ ద్వారా శుద్ధి చేసి సముద్రంలోకి విడిచిపెట్టాల్సి ఉన్నప్పటికీ, అలా చేయకుండా నేరుగా బహిరంగ ప్రదేశాల్లోకి విడిచిపెడుతూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతుందని మండి పడ్డారు. రాంకీ తీరు కారణంగా పరవాడ, భరణికం, తానాం, తాడి, ఈ.బోనంగి, లంకెలపాలెం, సాలాపువానిపాలెం ప్రజలు కాలుష్యంతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు అధికారులు రాంకీ యాజమాన్యానికి నోటీసులు ఇచ్చి చేతులు దులిపేసుకోవడంతో పరిస్థితి మరింత దారుణంగా తయారైందని ఆరోపించారు. వెంటనే శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

కల్యాణ మండప నిర్మాణం పరిశీలన

కొత్తూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : సత్యనారాయణపురం పంచాయతీ వుడా కాలనీలో కల్యాణ మండపం నిర్మాణ పనులను వీఎంఆర్‌డీఏ డీఈ ప్రసాదరావు సోమవారం పరిశీలించారు. నిర్మాణ పనులు పక్కాగా సాగాలని సిబ్బందిని ఆదేశించారు. దీనివల్ల సత్యనారాయణపురం, కొత్తూరు, పిసినికాడ పంచాయతీ ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని వివరించారు.

'ఎన్టీఆర్ కాలనీలో సౌకర్యాలు కల్పించండి'

సబ్బవరం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : పైడివాడ అగ్రహారం శివారు పైడివాడ ఎన్టీఆర్ కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని మాజీ సర్పంచ్ దాసరి వెంకటరమణ కోరారు. ఈ మేరకు సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో అర్జీని సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమ గ్రామంలో 2016-17లో అప్పటి టీడీపీ ప్రభుత్వం సర్వే నెంబరు 152లో 76 మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చి, ఇళ్లు మంజూరు చేసిందన్నారు. గృహ నిర్మాణ పథకం కింది లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకోగా, వారి ఖాతాలకు నగదు జమైనట్టు చెప్పారు. అయితే ఆ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం వివిధ కారణాలతో పట్టించుకోలేదన్నారు. దీంతో కాలనీలో రోడ్లు, డ్రైన్లు, వీధిలైట్లు వంటివి ఏర్పాటు చేయలేదని వాపోయారు. ఇప్పటికైనా ఈ సమస్యలపై ప్రత్యేక దృష్టిసారించాలని కోరారు. గ్రామ పెద్దలు అలమండ జోగారావు, బి.అప్పలరాజు, ఎస్.స్వాతి, సీహెచ్.రాజు, జి.హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

అన్నమయ్య పార్కు అభివృద్ధికి వినతి

అనకాపల్లి టౌన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శారదానది ఒడ్డున ఉన్న అన్నమయ్య పార్కును అభివృద్ధి చేయాలని సిద్ధార్థ సోషల్ సర్వీసెస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ అధ్యక్షుడు బల్లా నాగభూషణం కోరారు. ఈ మేరకు సోమవారం జీవీఎంసీ జోనల్ కమిషనర్ చక్రవర్తిని కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. శారదానదిపై కొత్త వంతెన నిర్మాణం చేపట్టడంతో పార్కుకు కళ తప్పిందన్నారు. అప్పటి నుంచి ఆ ప్రదేశమంతా దుర్భరంగా మారిందన్నారు. తక్షణమే ఈ సమస్యపై ప్రత్యేక దృష్టి సారించాలని విన్నవించారు. దీనిపై వెంటనే స్పందించిన జడ్సీ అనకాపల్లి జోనల్ ఉద్యానవన అధికారిణి ప్రియాంకకు పలు సూచనలు చేశారు. ముందుగా శానిటేషన్ విభాగం సిబ్బందితో ఆ ప్రదేశాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దాలన్నారు. పార్కు అభివృద్ధికి అవసరమయ్యే చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.



బెడ్డగుడలోని గిరిజనులతో ఇళ్ల నిర్మాణాలపై మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ బాబునాయక్

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి

గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ బాబునాయక్

అనంతగిరి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): పీఎం జనమన్ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ బాబునాయక్ ఆదేశించారు. మండలంలో కొత్తూరు పంచాయతీ పరిధిలోని బెడ్డగుడ గ్రామంలో ఇళ్ల నిర్మాణాలను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ మూడు విడతలు కలిపి 864 పీఎం జనమన్ ఇళ్లు మంజూరయ్యాయని చెప్పారు. ఇప్పటివరకు 110 ఇళ్లు పూర్తయ్యాయన్నారు. ఇంటి నిర్మాణానికి రూ.2.39 లక్షలు మంజూరు కాగా, అదనంగా రూ.లక్ష పెంచారని, ఈ విషయాన్ని లబ్ధిదారులు గ్రహించి ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఆయన సూచించారు. అలాగే ఇళ్లను నాణ్యతాప్రమాణాలతో నిర్మించుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ నగేశ్వరరావు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

డుంబ్రిగుడలో సదుపాయాలు కల్పించాలని జిల్లా కలెక్టర్‌కు వినతి



కలెక్టర్ దినేశ్‌కుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న టీడీపీ నేతలు

డుంబ్రిగుడ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో మౌలిక సౌకర్యాలు కల్పించాలని టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు సుబ్బారావు, టీఎన్‌టీయూసి ప్రధాన కార్యదర్శి స్వామి కోరారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ దినేశ్‌కుమార్‌కు సోమవారం కలిసి వినతాపత్రాన్ని అందజేశారు. డ్రైనేజీ, సీసీ రోడ్డు, శ్మశాన వాటికలో రోడ్డు, కమ్యూనిటీ భవనంలో బోరు తదితర సదుపాయాలు కల్పించాలని వారు విన్నవించారు. వారి వెంట పార్టీ నేత సింహాద్రి ఉన్నారు.

కల్వర్టు పునర్నిర్మాణానికి చర్యలు

- ఎస్‌ఎంఐ ఏఈఈ నాగరాణి
- 'ఆంధ్రజ్యోతి' ఎఫెక్ట్



కల్వర్టు నిర్మాణానికి తీసుకొచ్చిన తూరాలు

గూడెంకొత్తవీధి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి):మండలంలోని అద్దరవీధి రహదారిపై ప్రవహిస్తున్న వర్షపు నీటి ప్రవాహానికి అడ్డుకట్ట వేసి పంట పొలాలకు వెళ్లే విధంగా చర్యలు తీసుకుంటున్నామని ఎస్‌ఎంఐ ఏఈఈ నాగరాణి తెలిపారు. సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో 'వానొచ్చె.వరదొచ్చె' శీర్షికన ప్రచురితమైన కథనానికి జిల్లా కలెక్టర్, ఇరిగేషన్ అధికారులు స్పందించారు. వర్షాలకు కొట్టుకుపోయిన కల్వర్టుని తక్షణమే నిర్మించాలని ఏఈఈని ఆదేశించారు. ఈమేరకు కల్వర్టు నిర్మాణానికి అవసరమైన తూరలను జీకేవీధి తీసుకొచ్చారు. ఈసందర్భంగా ఏఈఈ మాట్లాడుతూ అద్దరవీధిలో కొట్టుకుపోయిన కల్వర్టుని పునర్నిర్మాణం చేపట్టనున్నామన్నారు. మూడు రోజుల్లో రహదారిపై ప్రవహిస్తున్న నీరు దారి మళ్లించి పనులు చేస్తామన్నారు.

హెల్మెట్ ధరించని 30 మందికి జరిమానా

పాడేరురూరల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): హెల్మెట్‌లు ధరించని 30 మంది ద్విచక్ర వాహనదారులకు సోమవారం జరిమానాలు విధించామని ఎస్‌ఐ ఎల్.సురేష్ తెలిపారు. పాడేరు-జి.మాడుగుల ప్రధాన రహదారిలో సెయింట్ ఆన్ స్కూల్ జంక్షన్ వద్ద సోమవారం వాహన తనిఖీలను నిర్వహించామన్నారు. ఈ తనిఖీల్లో హెల్మెట్‌లు ధరించిన వాహనదారులకు అవగాహన కల్పించామన్నారు. మైనర్లు వాహనాలు నడిపితే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించినట్టు తెలిపారు.

అనారోగ్యంతో గైగొంపల్లి ఆశ కార్యకర్త మృతి

గూడెంకొత్తవీధి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని జర్రెల పంచాయతీ గైగొంపల్లి ఆశ కార్యకర్త లువ్వాబు అచ్చియమ్మ (45) అనారోగ్యంతో కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందింది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం జర్రెల పంచాయతీ చింతలపాడు గ్రామానికి చెందిన అచ్చియమ్మ గైగొంపల్లి గ్రామంలో ఆశ కార్యకర్తగా పనిచేస్తున్నది. రెండు రోజుల క్రితం గుండెనొప్పి రావడంతో కుటుంబ సభ్యులు చింతపల్లి ఏరియా ఆస్పత్రికి తీసుకొచ్చారు. వైద్యులు ప్రాథమిక చికిత్స అందించి కేజీహెచ్‌కి తరలించారు. సోమవారం ఉదయం ఆమె కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఆమెకు భర్త, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఏజెన్సీలో కాఫీ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయాలి

- జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య

చింతపల్లి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి):గిరిజన సహకార సంస్థ నిర్మించతలపెట్టిన కాఫీ ప్రాసెసింగ్ యూనిట్ గిరిజన ప్రాంతంలో ఏర్పాటు చేయాలని స్థానిక జెడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య డిమాండ్ చేశారు. సోమవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ కాఫీ ప్రాసెసింగ్ యూనిట్‌కి గతంలో రూ.నాలుగు కోట్లను ప్రభుత్వం కేటాయించిందన్నారు. కొయ్యూరు మండలం డౌనూరులో ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేసేందుకు ఇప్పటికే పునాదులు నిర్మించడం జరిగిందన్నారు. ఒక వేళ స్థలం మార్పు చేయాలని భావిస్తే చింతపల్లిలో ఏర్పాటు చేయాలన్నారు. ప్రాసెసింగ్ యూనిట్ గిరిజన ప్రాంతంలో నిర్మించడం వల్ల 300మంది ఆదివాసీలకు ఉపాధి లభిస్తుందన్నారు. ఈకార్యక్రమంలో వైసీపీ నాయకులు జల్లి సుధాకర్, బొబ్బిలి లక్ష్మణ్ పాల్గొన్నారు.

రామాలయం వీధిలో తెగిపడిన విద్యుత్ తీగలు

చింతపల్లి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని రామాలయం వీధిలో 33 కేవీ విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. విద్యుత్ తీగలు పడిన సమయంలో జనసంచారం లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. సోమవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి రెండు గంటల వరకు భారీ వర్షం కురిసింది. వర్షం తగ్గిపోయిన గంట వ్యవధిలో మసీదు సమీపంలో 33 కేవీ విద్యుత్ తీగలు ఒక్కసారిగా కిందకు పడిపోయాయి. స్థానికులు ఏపీఈపీడీసీఎల్ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వెంటనే విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. అనంతరం సిబ్బంది కొత్త విద్యుత్ తీగలను ఏర్పాటు చేశారు.

గిరిజనుల అభ్యున్నతికే 'ఆది కర్మయోగి'

- అర్హులందరికీ సంక్షేమ పథకాలు చేరాలి
- జిల్లా కలెక్టర్ దినేశ్‌కుమార్



వర్క్‌షాపునకు హాజరైన ఆరు మండలాల అధికారులు... మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ దినేశ్‌కుమార్

అరకులోయ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): గిరిజనుల అభ్యున్నతి కోసమే ఆది కర్మయోగి అభియాన్ కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించిందని జిల్లా కలెక్టర్ దినేశ్‌కుమార్ చెప్పారు. మండల కేంద్రంలో సోమవారం ఈ కార్యక్రమంపై పీవీటీజీ ప్రాజెక్టు అధికారి రిషబ్ చతుర్వేది ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి శిక్షణ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ప్రభుత్వ కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో ఆది కర్మయోగి కార్యక్రమం అమలవుతుందన్నారు. ఇందులో భాగంగా రాష్ట్రంలోనే అత్యధిక శాతం గిరిజనులు ఉంటే అల్లూరి జిల్లాలో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించేందుకు మూడు రోజుల పాటు వర్క్‌షాపు నిర్వహిస్తున్నామని, ఇందులో అన్ని శాఖల అధికారులకు శిక్షణ ఇస్తున్నామని చెప్పారు. ఈ వర్క్‌షాపులో తెలుసుకున్న అంశాలను గ్రామ స్థాయిలో అధికారులు అమలు చేయాలని ఆయన సూచించారు. అలాగే ప్రాధాన్యక్రమంలో అభివృద్ధి పనులు చేపట్టాలని, అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలని కలెక్టర్ సూచించారు. అలాగే వికసిత్ భారత్ నిర్మాణంలో గిరిజన సమాజాన్ని భాగస్వామ్యం చేయడమే ఆది కర్మయోగి అభియాన్ ముఖ్య ఉద్దేశమన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని ఆరు మండలాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలను నెరవేర్చి పనులు చేపట్టండి

- లేకుంటే పనులను అడ్డుకుంటాం.. ▸ పంప్డ్ స్టోరేజీ ప్రాజెక్టు నిర్వాసితులు హెచ్చరిక



నినాదాలు చేస్తున్న గిరిజన జేఏసీ నాయకులు, నిర్వాసితులు

సీలేరు, ఆగస్టు 11, (ఆంధ్రజ్యోతి): ప్రజాభిప్రాయ సేకరణలో అధికారులు ఇచ్చిన హామీలను నెరవేర్చిన తర్వాతే పంప్డ్ స్టోరేజీ పనులను ప్రారంభించాలని, లేకుంటే పనులను అడ్డుకుంటామని దండకారణ్య విమోచన సమితి రాష్ట్ర అధ్యక్షుడు మార్క్‌రాజు అన్నారు. సోమవారం పార్వతీనగర్‌లో గిరిజన జేఏసీ ఆధ్వర్యంలో ప్రాజెక్టు నిర్వాసితులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పంప్డ్ స్టోరేజీ ఏర్పాటు కోసం 2024 మే ఒకటిన సీలేరులో నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో అధికారులు నిర్వాసితులకు ఇల్లు, భూమికి భూమి, ఇంటికి ఒకరికి చొప్పున ఉద్యోగం కల్పిస్తామని ఇచ్చిన హామీలను నెరవేర్చిన తర్వాతే ప్రాజెక్టు పనులను ప్రారంభించాలన్నారు. లేదంటే ప్రాజెక్టు పనులను అడ్డుకుంటామని హెచ్చరించారు. సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సుంకర విష్ణుమూర్తి మాట్లాడుతూ పర్యావరణం అనుమతులు రాకుండానే గోప్యంగా భూమి పూజను ఎలా నిర్వహిస్తారని ప్రశ్నించారు. సీపీఎం మండల సహాయ కార్యదర్శి అంపురింగి బుజ్జిబాబు మాట్లాడుతూ నిర్వాసితులకు ఎటువంటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా ఎక్కడికి వెళతారని ప్రశ్నించారు. నిర్వాసితులకు అండగా ఉంటామని, అవసరమైతే జైలుకు వెళతామన్నారు. ఈ సందర్భంగా అధికారులు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని నాయకులు, నిర్వాసితులు నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో దండకారణ్య విమోచన సమితి జిల్లా అధ్యక్షుడు మనోజ్‌కుమార్, స్థానిక సర్పంచ్ పి.దుర్గో, వివిధ సంఘాల ప్రతినిధులు, రాజకీయ పార్టీల నేతలు బలు, నాగేశ్వరరావు, సిద్దార్థమార్క్, చిటికెల రాము, కాశీ, కారే శ్రీనివాస్, ఎం. సత్తిబాబు, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీ అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు పెద్దపీట

- జీసీసీ మాజీ చైర్మన్ ఎంవీవీ ప్రసాద్



తాజంగిలో కరపత్రాలను అందజేస్తున్న జీసీసీ మాజీ చైర్మన్ ఎంవీవీ ప్రసాద్

చింతపల్లి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంత అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు పెద్దపీట వేశారని జీసీసీ మాజీ చైర్మన్ ఎంవీవీ ప్రసాద్ అన్నారు. సోమవారం తాజంగిలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఈసందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ఆదివాసీ దినోత్సవానికి వచ్చిన ముఖ్యమంత్రి గిరిజన ప్రాంత అభివృద్ధికి తన ప్రణాళికను స్పష్టం చేశారన్నారు. ప్రతి గిరిజనుడు ఆర్థికంగా బలపడేందుకు ప్రత్యేక కార్యాచరణను అమలులోకి తీసుకొస్తున్నారన్నారు. గిరిజనులు పండిస్తున్న కాఫీకి ప్రపంచ స్థాయిలోనే ప్రత్యేక బ్రాండింగ్ తీసుకొచ్చారన్నారు. మరో లక్ష ఎకరాల్లో కాఫీ సాగుకి ఆయన నిధులు కేటాయించారన్నారు. అర్హులందరికి పక్కా గృహాలు మంజూరు చేశారన్నారు. ప్రతి గిరిజన గ్రామానికి తారు రోడ్లు, రక్షిత నీటి పథకాల నిర్మాణానికి నిధులు మంజూరు చేశారన్నారు. కూటమి ప్రభుత్వం ఆదివాసీలకు శతశాతం రిజర్వేషన్ కల్పించేందుకు ప్రత్యేక జీవోను తీసుకొస్తుందని చంద్రబాబు స్పష్టం చేశారన్నారు. న్యాయస్థానాలు జీవోని రద్దు చేయకుండా పక్కాగా చట్టబద్ధ కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు చంద్రబాబు ప్రకటించడంపై గిరిజనులు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఇప్పటికైన వైసీపీ నాయకులు అసత్య ప్రచారాలను విడిచిపెట్టాలన్నారు. ఈకార్యక్రమంలో టీడీపీ నాయకులు బేరా సత్యనారాయణ పడాల్, కిముడు లక్ష్మయ్య, శ్యాంసుందర్, పార్వతి, పాంగి రామారావు పాల్గొన్నారు.

'పంచకర్ల' పర్యటనను జయప్రదం చేయండి : గంగులయ్య



సమావేశంలో మాట్లాడుతున్న జనసేన ఇన్‌చార్జి గంగులయ్య

చింతపల్లి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలో జనసేన ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షుడు పంచకర్ల రమేశ్‌బాబు మంగళవారం పర్యటించనున్నారని ఆ పార్టీ పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జి వంపూరి గంగులయ్య తెలిపారు. సోమవారం స్థానిక గిరిజన భవన్‌లో నియోజకవర్గ ముఖ్య నేతలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానాలు సొంతం చేసుకునేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రారంభించామన్నారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి విశాఖ జిల్లా అధ్యక్షుడు చింతపల్లిలో పర్యటిస్తున్నారన్నారు. ఉదయం 11 గంటలకు ఆయన లంబసింగి చేరుకుంటారని, అక్కడ నుంచి ర్యాలీగా చింతపల్లి చేరుకుంటామన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్మించిన అల్లూరి సీతారామరాజు విగ్రహాన్ని ఆవిష్కరిస్తారన్నారు. మండల కేంద్రంలో తండ్రి, కుమారుడు మృతి చెందిన జనసేన కార్యకర్త కుటుంబాన్ని పరామర్శిస్తారన్నారు. అనంతరం పార్టీ నేతలు, కార్యకర్తల సమావేశం నిర్వహిస్తామన్నారు. ఈ పర్యటనను కార్యకర్తలు, నాయకులు విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో జనసేన మండలాధ్యక్షుడు వంతల బుజ్జిబాబు, సీనియర్ నాయకులు సీతారామ్, ఉగ్రంగి లక్ష్మణరావు, గొర్లె వీర వెంకట్, పండు, సుర్ల వీరేంద్ర, వసుపరి ప్రసాద్, దూనబోయిన రమణ, సర్పంచ్ కృష్ణవంశీ పాల్గొన్నారు.

గుత్తులపుట్టును మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలి

- జీసీసీ చైర్మన్ శ్రావణ్ కుమార్‌కు వినతి



జీసీసీ చైర్మన్ శ్రావణ్ కుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న మండల సాధన కమిటీ ప్రతినిధులు

పాడేరురూరల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుత్తులపుట్టును నూతన మండల కేంద్రంగా ఏర్పాటుకు కృషిచేయాలని కోరుతూ గుత్తులపుట్టు మండల సాధన కమిటీ ప్రతినిధులు జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్‌కు వినతిపత్రం అందించారు. సోమవారం ఆయన క్యాంప్ కార్యాలయంలో కలిసిన సాధన కమిటీ ప్రతినిధులు మండల కేంద్రం సాధనకు సహకరించాలని అభ్యర్థించారు. అనంతరం మండల సాధన కమిటీ ప్రతినిధులు విలేకరులతో మాట్లాడుతూ పెదబయలు, హుకుంపేట, పాడేరు మండలాలకు చెందిన 16 గ్రామ పంచాయతీలను కలిపి గుత్తులపుట్టును మండలంగా ఏర్పాటు చేయాలని కోరామన్నారు. దీనిపై సానుకూలంగా స్పందించిన శ్రావణ్‌కుమార్ ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో మండల సాధన కమిటీ గౌరవాధ్యక్షుడు వి.సూర్యారావు, కన్వీనర్ వి.రాంబాబు, డి.సన్యాసిరావు, ప్రతినిధులు వి.సూరిబాబు, ఎం.బాబూజీ తదితరులు పాల్గొన్నారు.

ధారకొండను మండల కేంద్రంగా ప్రకటించాలి

- ఆరు పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు డిమాండ్

సీలేరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ధారకొండను మండల కేంద్రంగా ప్రకటించాలని ఆరు పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ధారకొండ, గుమ్మిరేవుల, దుప్పులవాడ, సీలేరు, గాలికొండ, అమ్మవారిధారకొండ పంచాయతీల ప్రజాప్రతినిధులు, అన్ని పార్టీల నాయకులు ధారకొండ సచివాలయంలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ధారకొండను మండల కేంద్రం సాధనకు అన్ని పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి మండల సాధన కమిటీని ఏర్పాటుచేశారు. అనంతరం సీపీఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు సుంకర విష్ణుమూర్తి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం మండలాల పునర్విభజన చేస్తే ధారకొండను మండల కేంద్రంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. పెసా మండల కమిటీ నాయకుడు శోభ జగన్ మాట్లాడుతూ ధారకొండను మండల కేంద్రంగా ప్రకటిస్తే ఆరు పంచాయతీల ప్రజలకు అనుకూలంగా ఉంటుందన్నారు. ప్రస్తుతం గూడెంకొత్తవీధి వెళ్లి రావాలంటే 100 కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ పాడేరు ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి సహకారంతో మండలం ఏర్పాటు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో దండకారణ్య విమోచన సమితి రాష్ట్ర అధ్యక్షుడు మార్క్‌రాజు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు దుర్గో, ఎస్.రాజు, ముర్ల కమలమ్మ, మాడీ రామన్న, మాజీ సర్పంచులు రాజు, బాబూరావు, ఏసు వరరాజు, నాయకులు పోతురాజు గోవింద్, కారే శ్రీనివాస్, మల్లు దొర, రాంబాబు, కృష్ణ పాల్గొన్నారు.

వాహన చోదకులు నిబంధనలు పాటించకపోతే చర్యలు



వాహన చోదకులతో మాట్లాడుతున్న ఎస్‌ఐ సూర్యనారాయణ

హుకుంపేట, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): వాహన చోదకులు నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవని ఎస్‌ఐ సూర్యనారాయణ హెచ్చరించారు. పాడేరు-హుకుంపేట ప్రధాన రహదారిలో సోమవారం వాహన తనిఖీలు చేపట్టారు. వాహన రికార్డులను పరిశీలించారు. అనంతరం వాహన చోదకులతో ఎస్‌ఐ మాట్లాడుతూ వాహనలకు అన్ని రికార్డులు ఉండాలని, లైసెన్సు లేకుండా వాహనాలు నడపకూడదని చెప్పారు. అలాగే ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, కారు డ్రైవర్లు సీటు బెల్టు పెట్టుకోవాలని స్పష్టం చేశారు. లేనిపక్షంలో జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు.

ఎంఈవో-2గా ప్రసాద్ బాధ్యతల స్వీకారం

కొయ్యూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) మండల విద్యాశాఖాధికారి-2గా బాలారం జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎమ్ వబ్బులరెడ్డి ప్రసాద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఎంఈవోగా పని చేసిన నాగభూషణం సీలేరుకు బదిలీ కావడంతో ఆయన స్థానంలో ప్రసాద్‌ను నియమించారు. ఈ మేరకు సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుమూల కొండలపై గల పాఠశాలలు సక్రమంగా పనిచేసేలా చర్యలు తీసుకుంటానన్నారు.

ఎంపీటీసీ సభ్యుల గౌరవ వేతనాలు విడుదల

కొయ్యూరు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వ హయాంలో గౌరవ వేతనాలకు నోచుకోని 14 మంది ఎంపీటీసీ సభ్యులకు కూటమి ప్రభుత్వం ఎనిమిది నెలల గౌరవ వేతనాలను విడుదల చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎంపీటీసీ సభ్యుల గౌరవ వేతనాలకు గానూ రెండు దఫాలుగా రూ.2.04 లక్షలు, మరో దఫా రూ.1.2 లక్షలు విడుదల చేసింది. ఎంపీటీసీ సభ్యుల గౌరవ వేతనాల చెల్లింపులకు చర్యలు తీసుకున్నట్టు ఎంపీడీవో కార్యాలయ ఏవో బాల మురళీకృష్ణ తెలిపారు.

విద్యార్థినులకు ఆత్మరక్షణ విద్య అవసరం

- జడ్పీ మాజీ చైర్‌పర్సన్ వంజంగి కాంతమ్మ



కోఫుకాన్ కరాటే క్లబ్ ప్రారంభిస్తున్న వంజంగి కాంతమ్మ

పాడేరురూరల్, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత సమాజంలో విద్యార్థినీ, విద్యార్థులకు విద్యతోపాటు ఆత్మరక్షణకు ఉపయోగపడే విద్య ఎంతో అవసరమని జిల్లాపరిషత్ మాజీ చైర్‌పర్సన్ వంజంగి కాంతమ్మ అన్నారు. స్థానిక మోదకొండమ్మ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన ఇంటర్నేషనల్ కోఫుకాన్ కరాటే క్లబ్‌ను సోమవారం ఆమె ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఆత్మరక్షణకు ఉపయోగపడే కరాటే శిక్షణను గిరిజన ప్రాంత బాలికలకు అందించాలని కరాటే చీఫ్ ఇన్‌స్ట్రక్టర్ బాకూరు పాండురాజుకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కె.కోటిబాబు, ప్రతినిధులు ఎల్.రత్నాబాయ్, కెజిచారాణి, బి.వెంకటరమణ పాల్గొన్నారు.

టీడీపీ సీనియర్ కార్యకర్తలకు సుముచిత స్థానం

- పీఏసీఎస్ చైర్‌పర్సన్ అబ్బాయి నాయుడు

చింతపల్లి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): టీడీపీలో సీనియర్ కార్యకర్తలకు పార్టీ అధిష్ఠానం సుముచిత స్థానం కల్పిస్తుందని పీఏసీఎస్ చైర్‌పర్సన్ గెమ్మెలి అబ్బాయి నాయుడు అన్నారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పార్టీలో సుమారు 30 ఏళ్లుగా కార్యకర్తగా పనిచేస్తున్నానన్నారు. తన సేవలను గుర్తించిన పార్టీ అధిష్ఠానం పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా నియమించడంపై సంతోషంగా ఉందన్నారు. తనను పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా నియమించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరికి కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మంటలు

కొయ్యూరు, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): రావణాపల్లి పంచాయతీ తోటలూరులో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఆదివారం అర్ధరాత్రి మంటలు వ్యాపించాయి. విషయాన్ని గుర్తించిన గ్రామస్థులు లైన్‌మన్ నాయుడుకు సమాచారం అందించడంతో సకాలంలో స్పందించి విద్యుత్ సరఫరా నిలిపివేశాడు హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని సమస్య గుర్తించి తాత్కాలికంగా సరఫరా పునరుద్ధరించారు. అనంతరం సోమవారం మధ్యాహ్నం సమస్యను పరిష్కరించారు.

ఎంఈవో-2గా త్రినాథరావు



ముంచంగిపుట్టు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మండల విద్యా శాఖ అధికారి (ఎంఈవో-2)గా త్రినాథరావు నియమితులయ్యారు. జోలాపుట్టు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా ఆయనకు ఈ బాధ్యతలు అప్పగిస్తూ ఆర్జేడీ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు త్రినాథరావు సోమవారం బాధ్యతలను చేపట్టారు. మండలంలో విద్యాభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఆయన చెప్పారు.

రహదారి నిర్మాణానికి సర్వే

అనంతగిరి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మారుమూల పినకోట పంచాయతీ బొర్రాపాలెం నుంచి కర్రిమామిడి, పందిరిమామిడి మీదుగా బోనూరు వరకు రోడ్డు నిర్మాణానికి ఇంజరింగ్ శాఖ అధికారులు సోమవారం సర్వే చేశారు. ఆయా గ్రామాలకు ఇప్పటికీ రోడ్డు సౌకర్యం లేకపోవడంతో గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, పినకోట పంచాయతీ కేంద్రానికి వచ్చే రేషన్ సరకులు కాలి నడకనే తీసుకు వెళ్తున్నారని, దీనిపై అధికారులు స్పందించి రోడ్డు నిర్మించాలని సర్పంచ్ గణేశ్ కోరారు. ఈ మేరకు రోడ్డు నిర్మాణానికి సర్వే చేయగా, సుమారు ఏడు కిలోమీటర్ల వరకు రోడ్డు నిర్మించాల్సి ఉన్నట్టు అధికారులు తెలిపారు.

తాగునీటి సౌకర్యం కల్పించరూ..

అనంతగిరి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేంగడ పంచాయతీ మెట్టవలస గ్రామంలో తాగునీటి సదుపాయం కల్పించాలని మాజీ సర్పంచ్ సీవేరి కొండలరావు కోరారు. గ్రామంలో తాగునీటి సమస్య తీవ్రంగా వేధిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యపై అధికారులు స్పందించి గ్రామంలో తాగునీటి పథకం మంజూరు చేయాలని విన్నవించారు.

మండల సర్వసభ్య సమావేశం రేపు

పెదబయలు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సర్వసభ్య సమావేశం నిర్వహిస్తామని ఎంపీడీవో ఎల్.పూర్ణయ్య తెలిపారు. ఎంపీపీ బొండా వరహాలమ్మ అధ్యక్షతన ఆ రోజు ఉదయం 10 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని చెప్పారు. అన్ని శాఖల మండల స్థాయి అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు హాజరుకావాలని కోరారు.

ఉద్యానవన పంటలతో ఆర్థికాభివృద్ధి

కేంద్ర కాఫీ బోర్డు సభ్యుడు శెట్టి రాజు



గిరిజన రైతులకు మొక్కలను పంపిణీ చేస్తున్న రాజు

అనంతగిరి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఉద్యానవన పంటలతో ఆర్థికంగా అభివృద్ధి చెందుతారని కేంద్ర కాఫీ బోర్డు సభ్యుడు శెట్టి రాజు చెప్పారు. టోకూరు పంచాయతీలోని బగారమ్మవలసలో ఉపాధి హామీ పథకంలో భాగంగా సిల్వర్‌ఓక్, నలమద్ది తదితర మొక్కలను గిరిజనులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిల్వర్‌ఓక్ మొక్కలను నాటిన తరువాత కాఫీ మొక్కలు వేయాలని సూచించారు. తద్వారా కాఫీ తోటల నుంచి వచ్చే ఆదాయంతో ఆర్థికంగా ఎదగవచ్చునని వివరించారు. కాఫీ తోటల విస్తరణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలోని క్షేత్ర స్థాయి సిబ్బంది భాను, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.



వారపు సంతలో విక్రయానికి తీసుకు వచ్చిన సీతాఫలాలు

సీతాఫలాలకు గిట్టుబాటు ధర

▸▸ కావిడ రూ.1200 నుంచి రూ.1500కు విక్రయం

మాడుగుల, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సోమవారం జరిగిన వారపు సంతలో సీతాఫలాలకు గిట్టుబాటు ధర లభించింది. ఏజెన్సీ ప్రాంతాల నుంచి ఇక్కడికి విక్రయానికి తీసుకొని వచ్చిన కావిడి సీతాఫలాలు రూ.1200 నుంచి రూ.1500కు అమ్ముడయ్యాయి. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని పాడేరు మండలంలో వంట్లమామిడి, కక్కి, కందులపాలెం, దేవాపురం, ఫులుసుమామిడి, సలుగు తదితర పలు గిరిజన గ్రామాల నుంచి విక్రయానికి సీతాఫలాలను తీసుకొని వచ్చారు. అయితే కావిడి సీతాఫలం సంత ప్రారంభంలో రూ.1500 వరకు అమ్ముడయ్యాయి. సంత ముగింపు సమయాన్ని ధర రూ.1500 నుంచి రూ.1200కు తగ్గుముఖం పట్టింది. వ్యాపారులు పెద్దగా రాకపోవడంతో ధర తగ్గిందని, అయినప్పటికీ గిట్టుబాటు అయిందని రైతులు చెప్పారు. వచ్చే వారం నుంచి సీతాఫలాల ధరలు అధికంగా పెరిగే అవకాశాలు ఉన్నాయని రైతలుఱ ఆశాభావం వ్యక్తం చేశారు.

రామన్నపాలెంలో వైద్య శిబిరం

▸▸ 'ఆంధ్రజ్యోతి' కథనంతో కదిలిన వైద్యులు



వైద్య శిబిరంలో రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి

మాకవరపాలెం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామన్నపాలెం గ్రామంలో సోమవారం ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. 'రామన్నపాలెంలో జ్వరాల విజృంభణ' అనే శీర్షికతో సోమవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈ మేరకు గ్రామంలో చెత్తాచెదారం తొలగించారు. ఎక్కడికక్కడ బ్లీచింగ్ చల్లించారు. అలాగే ప్రత్యేక వైద్య శిబిరం ఏర్పాటు చేసి, రోగులకు వైద్య పరీక్షలు చేశారు. ఇంటింటికీ వెళ్లి జ్వర బాధితుల వివరాలు సేకరించారు. కార్యక్రమంలో నర్సీపట్నం మలేరియా సబ్ యూనిట్ అధికారి ఎస్.రమణ, వైద్యాధికారి శ్రీనివాసరావు, సిబ్బంది ప్రభాకర్, శివ పాల్గొన్నారు.

అధ్వానంగా జి.వెంకటాపురం రోడ్డు



రహదారిలో ఏర్పడ్డ భారీ గతుకులు

మాకవరపాలెం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జి.వెంకటాపురం రహదారి అధ్వానంగా తయారైంది. ఈ రోడ్డు పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. ఇటీవల కురిసిన వర్షాలకు గోతుల నిండా వర్షపు నీరు చేరడంతో చెరువులను తలపిస్తున్నాయి. దీంతో ఈ మార్గంలో ప్రమాదాలకు గురవుతున్నామని వాహన చోదకులు ఆందోళన చెందుతున్నారు. రాత్రి సమయాల్లో ఈ గోతుల్లో పడిపోతున్నామని వారు వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు మధ్యలో ఉన్న గోతులను పూడ్చాలని వాహన చోదకులు, స్థానిక ప్రజలు కోరుతున్నారు.

సమస్యలపై డిగ్రీ కళాశాల అధ్యాపకుల నిరసన



కళాశాల ఎదుట నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న అధ్యాపకులు

చోడవరం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరై నిరసన తెలిపారు. సాధారణ బదిలీలు, పదోన్నతులు కల్పించాలని, ప్రస్తుత అధ్యాపకుల స్థాయిని సహాయ ప్రొఫెసర్ల స్థాయికి పెంచాలని నినాదాలు చేశారు. అన్ని శాఖలలో సాధారణ బదిలీలు చేపట్టినా ఉన్నత విద్యా శాఖలో బదిలీలు చేపట్టకపోవడం సరికాదని, డిజిగ్నేషన్ మార్పు చేయాలని, జీవో నంబరు 42 రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

నాలుగు పీఏసీఎస్‌లకు చైర్‌పర్సన్ల నియామకం




సత్యనారాయణ, శ్రీనివాసరావు

బుచ్చెయ్యపేట ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాలుగు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు చైర్‌పర్సన్లను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తురకలపూడి సంఘ చైర్మన్‌గా కోట సత్యనారాయణ, సభ్యులుగా కంద మూర్తిరావు, కరగాన నాగేశ్వరరావు, బంగారుమెట్ట సంఘ చైర్మన్‌గా దొండా శ్రీనివాసరావు, సభ్యులుగా ఒంటెదు సాంబమూర్తి, సాయం అయ్యన్నదొర, బుచ్చెయ్యపేట సంఘ చైర్మన్‌గా దొంకిన అప్పలనాయుడు, సభ్యులుగా పెదిరెడ్ల శ్రీనివాసరావు, మొల్లి ఈశ్వరరావు, విజయరామరాజుపేట సంఘ చైర్మన్‌గా దొడ్డి వెంకట కాశీ సత్యనారాయణ, సభ్యులుగా బీశెట్టి వెంకటరమణ, జొన్న భీమునాయుడు నియమితులయ్యారు.

చీడికాడ చైర్‌పర్సన్‌గా జగన్నాథం



గవిరెడ్డి జగన్నాథం

చీడికాడ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం చీడికాడ ప్రాథమిక సహకార సంఘానికి త్రీ మెన్ కమిటీని నియమిస్తూ ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయని సొసైటీ కార్యదర్శి మజ్జి వరహాలుదొర సోమవారం తెలిపారు. సంఘం అధ్యక్షుడిగా గవిరెడ్డి జగన్నాథం (అప్పలరాజుపురం), డైరెక్టర్లుగా భూసాల దేముడునాయుడు (చీడికాడ), పేరపు అప్పారావు (చుక్కపల్లి)లను నియమించారన్నారు. సంఘం పరిధిలోని 19 పంచాయతీలు ఉండడంతో జిల్లాలోనే అతి పెద్ద సంఘంగా చీడికాడ ఏర్పడినట్టు చెప్పారు.

ఈదురుగాలులతో భారీ వర్షం

▸▸ పలు చోట్ల నేలకొరిగిన చెట్లు
▸▸ వరి నారు మడులకు ఊపిరి
▸▸ ఆనందోత్సాహంలో అన్నదాతలు



రావికమతం మండలం కొమిరలో ఈదురుగాలులతో కురుస్తున్న వాన

రావికమతం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు మండలాల్లో సోమవారం భారీ వర్షం కురిసింది. నర్సీపట్నం, చోడవరం, మాడుగుల నియోజకవర్గాల్లోని చాలా గ్రామాల్లో వాన దంచికొట్టింది. నర్సీపట్నం, రావికమతం మండల కేంద్రాల్లో ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి. దీంతో పలు చోట్ల చెట్లు నేలకొరిగాయి. అయితే ఈ వర్షాలు వరి నారు మడులకు ఊపిరి పోశాయి. దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

గత కొంత కాలంగా తీవ్ర వర్షభావం నెలకొంది. ఆగస్టులో వర్షాల లేదు. సరికదా ఎండలు మండిపోయాయి. వేసవిని తలపించే ఎండతో రైతులు విలవిలలాడిపోయారు. వరి నారు మడులకు నీరు అందక ఎండిపోతున్నాయి. ఇప్పటికే ఎండిపోతున్న నారు మడులను రైతులు రెండు, మూడు పర్యాయాలు నీటి తడులు వేసి కాపాడుకుంటూ వస్తున్నారు. దమ్ములకు, వరి నాట్లకు అదను దాటుతుందేమోనన్న ఆందోళనతో ఉన్న తరుణంలో, సోమవారం సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం మారిపోయి దట్టమైన మబ్బులు కమ్మేశాయి. ఈ క్రమంలో ఈదురగాలులతో భారీ వర్షం కురిసింది. రావికమతం మండలంలోని పలు గ్రామాల్లో వాన దంచికొట్టింది. అలాగే ఈదురుగాలులకు చెట్టు కూలిపోయాయి. అయితే ఈ వర్షం దమ్ములుకు, వరి నాట్లకు ఎంతగానో దోహదపడుతుందనిరైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కాగా, చెట్లు విరిగిపడడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

కె.కోటపాడులో

కె.కోటపాడు, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం మధ్యాహ్నం సుమారు గంట సేపు కుండపోత వర్షం కురిసింది. దీంతో ఎండ వేడి నుంచి ప్రజలు ఉపశమనం పొందారు. కొద్ది రోజులుగా వేసవిని తలపించే విధంగా ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో అల్లాడిపోయిన ప్రజానీకానికి ఈ వాన ఊరటనిచ్చింది. వాతావరణం చల్లబడిపోవడంతో వృద్ధులు, గర్భిణులు, బాలింతలు ఆనందం వ్యక్తం చేశారు. వరి నాడు మడులకు ఈ వర్షం ఎంతగానో ఉపయోగపడుతుందని రైతులు ఆనందపడుతున్నారు.

మాడుగులలో...

మాడుగుల, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలో పలుచోట్ల సోమవారం సాయంత్రం కుండపోత వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ అధికంగా ఉండడంతో ప్రజలు ఉక్కపోతతో అల్లాడారు. ఈ క్రమంలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయి గాలులతో వాన పడడంతో వాతావరణం చల్లబడింది. దీంతో ప్రజలు ఉపశమనం పొందారు. ఈ వర్షం పంటలకు ఊపిరిపోసినట్టయింది.



రావికమతం మండలం మత్స్యపురంలో నేలకొరిగిన టేకు చెట్టు

అర్జీలను సత్వరమే పరిష్కరించండి: ఆర్డీవో



వినతిపత్రాలు స్వీకరిస్తున్న ఆర్డీవో వీవీ రమణ

నర్సీపట్నం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరించాలని ఆర్డీవో వీవీ.రమణ ఆదేశించారు. సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో 30 వినతి పత్రాలు వచ్చాయి. వీటిని ఆర్డీవో స్వీకరించారు. ఐద్వా ప్రతినిధులు సూర్య ప్రభ, ఎల్.గౌరీ తదితరులు ఐదు రోడ్ల కూడలిలోని సత్యవాణి లాడ్జి దుకాణాలలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దగ్గర, బ్రిటీష్ సమాధుల స్థలంలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న వైన్ షాపులు తొలగించాలని కోరారు. నర్సీపట్నం మండలం గబ్బాడ గ్రామానికి చెందిన 25 మంది రైతు కుటుంబాలు అన్నదాత సుఖీభవ డబ్బులు పడలేదని ఫిర్యాదు చేశారు. గతంలో రైతు భరోసా డబ్బులు పడేవని, రీ సర్వేలో భూములు హోల్డ్‌లో పెట్టడంతో ప్రభుత్వం ఇస్తున్న పెట్టుబడి సాయం అందక నష్టపోయామని పెదపూడి కుమారి, చేవేటి నాగమణి, రత్నం తదితరులు వినతిపత్రం అందజేశారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 2003లో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు సీతకండి రెవెన్యూలో సుమారు వంద ఎకరాలపైగా భూములు దళితులకు ఇచ్చారని తెలిపారు. పీజీఆర్ఎస్‌లో అత్యధిక శాతం భూ సమస్యలపైనే వినతిపత్రాలు అందాయి. వీటిని పరిశీలించి పరిష్కారానికి సత్వరమే చర్యలు చేపట్టాలని ఆయా శాఖల అధికారులకు ఆర్డీవో ఆదేశించారు.

కోనాం జలాశయం నీరు విడుదల

చీడికాడ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): కోనాం జలాశయం నుంచి సాగునీరు విడుదలను పెంచామని నీటిపారుదల శాఖ ఏఈఈ సత్యనారాయణదొర తెలిపారు. సోమవారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ జలాశయం గరిష్ఠ స్థాయి నీటిమట్టం 101.25 మీటర్లుకాగా, ప్రస్తుతం 93.6 మీటర్లు ఉందన్నారు. గత నెల 25న ఎగువ కాలువకు 30 క్యూసెక్కులు, దిగువ కాలువకు 50 క్యూసెక్కుల సాగునీరు విడుదల చేశామన్నారు. గత రెండు రోజులుగా దిగువ కాలువ ద్వారా 80 క్యూసెక్కులు సాగునీటిని విడుదల చేస్తున్నామన్నారు. జలాశయం పరిధిలో ఇప్పటికే 50 శాతం వరినాట్లు పూర్తికాగా, మరింత పెరిగేలా సాగునీటి విడుదల పెంచామన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

జనసేన కుటుంబాలకు ఇన్‌చార్జి రాజు పరామర్శ

బుచ్చెయ్యపేట, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతపాక గ్రామంలో ముగ్గురు జన సైనికుల కుటుంబాలను జనసేన పార్టీ చోడవరం నియోజకవర్గం ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు సోమవారం పరామర్శించారు. సకురు మహేశ్ కుటుంబంలో పాటు తండ్రి, ఇద్దరు సోదరులు, ఒక సోదరి, కేవలం ఆరు నెలల వ్యవధిలో మరణించడంతో ఆకుటుంబానికి తీరని శోకాన్ని మిగిల్చింది. వారి కుటుంబ సభ్యులను రాజు పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం సలాది మహేశ్ కుటుంబాన్ని పరామర్శించి మహేశ్ మరణానికి ముందు అతని భార్య మరణించగా, ఇద్దరు పిల్లలు ఆధారం కోల్పోయారు. వీరిని కూడా రాజు పరామర్శించారు. తొందరలోనే వారి కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందచేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సలాది నాగేశ్, బండారు గణేశ్, గంట్ల నరేశ్, దుర్గవరపు రవి, తదితరులు పాల్గొన్నారు.

ఊపందుకున్న వరి నాట్లు

▸▸ నిండుగా రైవాడ జలాశయం.. రైతుల ఆనందం



నాగయ్యపేటలో పంట పొలాల్లో సమృద్ధిగా ఉన్న నీరు

దేవరాపల్లి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైవాడ జలాశయం నీటితో కళకళలాడుతోంది. భారీగా వర్షం పడడంతో జలాశయంలో మరింత నీరు చేరింది. దీంతో రైతులు ఆనందంలో ఉన్నారు. వరి నాట్లు వేసే పనిలో వారు నిమగ్నమయ్యారు.



నిండుగా ఉన్న రైవాడ జలాశయం

రైవాడ జలాశయ పరీవాహక ప్రాంతంలో వర్షం పడడంతో 300 క్యూసెక్కుల వరద నీరు సమ్మెద గెడ్డ, పినకోట చల్లగెడ్డ నుంచి చేరుతున్నది. గత ఏడాది ఇదే రోజుకు రైవాడ జలాశయ నీటిమట్టం 108 మీటర్లు కాగా, ఆదివారం ఉదయానికి 111.1 మీటర్ల నీరు చేరింది. ఎడమ, కుడి కాలువలకు 150 క్యూసెక్కుల నీరు విడుదల చేయడంతో పాటు విశాఖ నగర పాలక సంస్థకు తాగునీటి కోసం 50 క్యూసెక్కులు నీటిని ప్రతి రోజూ సరఫరా చేస్తున్నారు. రైవాడ జలాశ గరిష్ఠ నీటిమట్టం 114 మీటర్లు కాగా, ఆదివారానికి 111.1 మీటర్లు ఉంది. శనివారం, శుక్రవారం కురిసిన వర్షాలతో నాగయ్యపేట, వెంకటరాజపురం, తెనుగుపూడి, వాకపల్లి, తామరబ్బ, చింతలపూడి పంచాయతీల్లో కూడా రైతులు వరి నాట్లు వేస్తున్నారు.

భూసేకరణ ప్రతిపాదనను విరమించుకోవాలి

▸▸ బుచ్చెయ్యపేట మండలంలోని మూడు గ్రామాల రైతులు డిమాండ్
▸▸ రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా

అనకాపల్లి రూరల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): బుచ్చెయ్యపేట మండలంలోని ఆర్.భీమవరం, ఆర్.శివరామపురం, మల్లాం పంచాయతీల్లో భూసేకరణ ప్రతిపాదనలను వ్యతిరేకిస్తూ రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట రైతులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి దంతులూరి వర్మ మాట్లాడుతూ, చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ ఎస్ రాజు, బుచ్చెయ్యపేట తహసీల్దార్, జిల్లా కలెక్టర్ తక్షణమే స్పందించి భూసేకరణ ప్రతిపాదనను వెనక్కి తీసుకుంటున్నట్టు ప్రకటించాలని డిమాండ్ చేశారు. అభివృద్ధి పేరుతో ప్రజల జీవనోపాధిని దెబ్బతీసే బలవంతపు భూసేకరణను నిలిపివేయాలన్నారు. కార్పొరేట్ కంపెనీలను, పారిశ్రామికవేత్తలకు చౌకగా భూములు ఇచ్చేందుకు రైతుల నుంచి భూములను లాక్కుంటున్నారని ఆయన ఆరోపించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ జాహ్నవిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి కోన మోహనరావు, తదితరులు పాల్గొన్నారు.

గోవాడ షుగర్ ఫ్యాక్టరీని ఆదుకోవాలి

▸▸ కలెక్టరేట్ ఎదుట రైతులు ఆందోళన

అనకాపల్లి కలెక్టరేట్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి) : కష్టాల్లో ఉన్న గోవాడ షుగర్ ఫ్యాక్టరీని ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ఎదుట సదరు ఫ్యాక్టరీ రైతులు, కార్మికులు, నాయకులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల ముందు కూటమి నాయకులు ఇచ్చిన హామీ మేరకు ఫ్యాక్టరీని ఆదుకోవాలని, గత సీజన్‌లో బకాయిన పడిన రూ.30 కోట్లను వెంటనే చెల్లించాలని కోరారు. అలాగే, ఆధునికీకరణకు వంద కోట్ల రూపాయలను మంజూరు చేసి, రాష్ట్రంలో ఉన్న ఏకైక ఈ సహకార చక్కెర కర్మాగారాన్ని కాపాడాలని విన్నవించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



అనకాపల్లిలో కలెక్టర్ కార్యాలయం ఎదుట నినాదాలు చేస్తున్న రైతులు, కార్మికులు

డాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని ఆశ కార్యకర్తల ధర్నా



చీడికాడ పీహెచ్‌సీ వద్ద ధర్నా చేస్తున్న ఆశ కార్యకర్తలు

చీడికాడ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): డాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆశ కార్యకర్తలు సోమవారం ఆందోళనకు దిగారు. చీడికాడ పీహెచ్‌సీ పరిధిలోని కోనాం సబ్ సెంటర్‌లో పనిచేస్తున్న గర్భింగి లక్ష్మి, చిరగం మల్లేశ్వరిలకు సంబంధించిన మే, జూన్ నెలలను జీతాలు నిలిపివేశారని, శిరిజాం సచివాలయం పరిధిలోని యడ్ల దేవి, ఎం.చిన్నమ్మల జూన్ నెల జీతం ఎటువంటి కారణం లేకుండా ఆపేశారని వారు ఆరోపించారు. నలుగురు జీతాలు ఎటువంటి కారణం లేకుండా నిలిపి వేసిన డాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా సీఐటీయూ డివిజన్ కార్యదర్శి రొంగలి దేముడునాయుడు డిమాండ్ చేశారు. అలాగే సబ్ సెంటర్ వద్ద రూములను ఆశ కార్యకర్తలతో తుడిపించడం, కుర్చీలు మోయించడం, బాత్‌రూమ్‌లు కడిగించడం వంటి పనులు చేయించడం సిగ్గుచేటన్నారు. తక్షణమే సంబంధిత అధికారులు చీడికాడ ప్రభుత్వ ఆస్పత్రిపై దృష్టిసారించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు యడ్లదేవి, మల్లేశ్వరి, కొండమ్మ, కామాక్షి, చిన్నమ్మ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పీహెచ్‌సీ రెండో వైద్యాధికారి మురళీకృష్ణ వచ్చి వారి సమస్యను అడిగి తెలుసుకున్నారు.

పేదరికం నుంచి బయటపడేలా చూడండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో సీతారామస్వామి

రావికమతం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పీ-4 కింద నిరుపేద కుటుంబాలను దత్తత తీసుకొని పేదరికం నుంచి బయట పడేలా వెలుగు సిబ్బంది తగిన చర్యలు చేపట్టాలని ఎంపీడీవో సీతారామస్వామి సూచించారు. మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయంలో సోమవారం పీ-4 బంగారు కుటుంబాలపై వెలుగు సిబ్బందితో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్వాక్రా సంఘాల్లోని సభ్యుల జీవనోపాధి, స్వయం ఉపాధికి ఆవులు, గేదెలు కొనుగోలు పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. మండలానికి 610 స్వయం సహాయక సంఘాల పరిధిలో గేదెల యూనిట్లు 26, ఆవుల యూనిట్ల్ 52 మంజూరయ్యాయన్నారు. వీటికి అర్హులైన మహిళా లబ్ధిదారులను ఎంపిక చేసి, వారికి జీవనోపాధి రుణాలు అందించాలని ఆయన సూచించారు. త్వరగతిన లక్ష్యాలను పూర్తి చేయాలని వెలుగు సిబ్బందికి ఎంపీడీవో ఆదేశించారు.

దొండపూడి దుర్గాలమ్మ విగ్రహం ఊరేగింపు



గ్రామంలో విగ్రహ కలశం ఊరేగింపు నిర్వహిస్తున్న గ్రామస్థులు

రావికమతం, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దొండపూడి గ్రామంలో దుర్గాలమ్మ విగ్రహ కలశం ఊరేగింపు కార్యక్రమం సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని అందరూ విరాళాలతో సంయుక్తంగా దుర్గాలమ్మ నూతన ఆలయం నిర్మించారు. ఈ ఆలయాన్ని ఈ నెల 14న ప్రారంభోత్సవం చేసేందుకు గ్రామస్థులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇందులో భాగంగా సోమవారం వినాయక పూజతో ప్రారంభించి, అమ్మవారికి గ్రామంలో సతకం పట్టు నుంచి శోభయాత్రతో విగ్రహ కలశ ఊరేగింపును నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

పడాల యశ్వంత్‌కు నివాళులు

చీడికాడ, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తునివలస గ్రామంలో సోమవారం పడాల యశ్వంత్‌కు ఘనంగా నివాళులర్పించారు. సమాధి వద్ద సోమవారం ప్రత్యేకంగా పూజలు చేశారు. ఈ సందర్భంగా యశ్వంత్ మృతి తమకు తీరని లోటని మాజీ సర్పంచ్, అతని తండ్రి అప్పలనాయుడు వాపోయారు. ఈ కార్యక్రమంలో కుటుంబీకులు గూటాల పైడితల్లమ్మ, సూర్యకళ, తదితరులు పాల్గొన్నారు.



యశ్వంత్ సమాధి వద్ద నివాళులు అర్పిస్తున్న అప్పలనాయుడు

డ్రమ్ సీడర్‌తో వరి సాగు

తక్కువ నీటి వినియోగంతో పంట సాగు

- ఎకరాకు 12-18 కిలోల విత్తనం చాలు
- వరుసలు, మొక్కల మధ్య నిర్ణీత దూరం
- మందులతో కలుపు బెడద నివారణ
- సాధారణ పద్ధతితో పోలిస్తే నీరు, సమయం ఆదా
- పది రోజుల ముందుగానే కోత
- 30 శాతం అధికంగా ధాన్యం దిగుబడి
- బీసీటీ కేవీకే సేద్య శాస్త్రవేత్త డాక్టర్ వానా ప్రసాదరావు

రాంబిల్లి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి):

సుమారు నెల రోజుల నుంచి జిల్లాలో సరైన వర్షాలు పడకపోవడంతో వర్షాధార భూములు, చెరువుల ఆయకట్టు కింద భూముల్లో వరినాట్లు జాప్యం అయ్యేలా వున్నాయి. ఇప్పటికే పోసిన ఆకుమడుల్లో వరినారు ఎండిపోతున్నది. దీంతో రానున్న వారం రోజుల్లో వర్షాలు కురిసినా.. ఆయా ప్రాంతాల్లో వరినారు అందుబాటులో వుండదు. ఇటువంటి సమస్యను అధిగమించి, యథావిధిగా వరి సాగు చేయడానికి డ్రమ్ సీడర్ విధానం దోహదపడుతుందని హరిపురం బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం సేద్య శాస్త్రవేత్త డాక్టర్ వానా ప్రసాదరావు చెప్పారు. డ్రమ్ సీడర్ ద్వారా వరి విత్తనాలు వేయడం, కలుపు నివారణ, ఎరువుల వినియోగం గురించి ఆయన తెలిపిన వివరాలు..


డ్రమ్ సీడర్ ద్వారా పొలంలో వరి విత్తనాలు వేస్తున్న రైతులు


డాక్టర్ వాన ప్రసాద్‌రావు, బీసీటీ కేవీకే సేద్యశాస్త్రవేత్త

ఎకరాకు 12-18 కిలోల విత్తనం అవసరం. ప్రత్యేకంగా ఫలానా రకం విత్తం వాడాలని లేదు. నేలలకు అనువైన రకాన్ని విత్తుకోవచ్చు. కిలో విత్తనానికి ఒక గ్రాము చొప్పున బావిస్టిన్ పొడితో విత్తన శుద్ధి చేసుకోవాలి. ఒక లీటరు నీటికి ఒక గ్రాము చొప్పున బావిస్టిన్ పొడిని కలిపి, అందువల్ల వరి విత్తనాలు పోసి 24 గంటలపాటు నానబెట్టాలి. తరువాత విత్తనాలను వడకట్టి, మంచినీటితో కడిగి, గోనె సంచిలో పోసి మూత కట్టాలి. దీనిని ఒక రోజుపాటు అలాగే వుంచాలి. సన్నరకాలు అయితే 12 గంటలు సరిపోతుంది. ఈలోగా డ్రమ్ సీడర్‌తోపాటు విత్తనం వేయడానికి పొలాన్ని సిద్ధం చేసుకోవాలి. బంక నేలలో దమ్ము చేసిన మరుసటిరోజు విత్తుకోవచ్చు. విత్తనం వేసే సమయానికి పొలంలో నీరు లేకుండా బురదగా ఉంటే చాలు. ఇసుక నేలలు అయితే విత్తుకొనే రోజే ఆఖరి దమ్ము చేసి పలుచటి నీటిపొర ఉండేటట్టు చూసుకోవాలి.24 గంటలపాటు మండె కట్టిన (గోనె సంచిలో వుంచిన) విత్తనాన్ని డ్రమ్ సీడర్‌లో నింపి మూత బిగించాలి. విత్తనాలు సులువుగా రాలడానికి ప్రతి డ్రమ్‌లో 3/4 వంతు మాత్రమే విత్తనాలు నింపాలి. పొలంలో డ్రమ్ సీడర్ లాగుతూ విత్తనాలు వేసుకోవాలి. ఎనిమిది వరుసలు, వరుసకు వరుసకు మధ్య 20 సెంటీమీటర్లు, కుదురుకు కుదురుకు మధ్య ఐదు సెంటీమీటర్ల దూరంలో విత్తనాలు పడతాయి. ఒక్కో కుదురుకు 3-5 గింజలు పడతాయి. ఈ పద్ధతిలో విత్తడానికి ఎకరాకు రెండు గంటలు పడుతుంది. ఒకరు డ్రమ్ లాగడానికి, మరోకరు డ్రమ్‌లో విత్తనాలు నింపడానికి.. ఇద్దరు వ్యక్తులు అవసరం అవుతారు. ఇద్దరు వ్యక్తులు ఒక రోజులో మూడు నుంచి నాలుగు ఎకరాల్లో డ్రమ్ సీడర్ ద్వారా వరి విత్తనాలు వేసుకోవచ్చు.


డ్రమ్ సీడర్‌తో విత్తనాలు వేసి పొలంలో వరి పైరు (ఫైల్ ఫోటో)

ఎరువుల యాజమాన్యం

ఆకు మడుల్లో నారును పెంచి, ప్రధాన పొలంలో నాటే పద్ధతిలో ఏయే ఎరువులు, ఎంతెంత మోతాదులో వేస్తారో, డ్రమ్ సీడర్ విధానంలో కూడా అంతే మొత్తం ఎరువులు వాడుకోవాలి. పూర్తి భాస్వరం, సగం పొటాష్ ఎరువును ఆఖరి దమ్ములో వేయాలి. మిగతా సగం పోటాష్‌ను అంకుర దశలో వేయాలి.

కలుపు నివారణ

వరి విత్తనాలను బురద నేలల్లో నేరుగా విత్తనం వల్ల వరితోపాటు కలుపు విత్తనాలు కూడా మొలకెత్తుతాయి. అందువల్ల విత్తిన 35-40 రోజుల వరకు కలుపు బెడద లేకుండా చూసుకోవాలి. విత్తిన 3-5 రోజుల మధ్య ఆక్సాడయార్జిల్ 35 గ్రాములు లేదా బ్యుటాక్లోర్ 500 మిల్లీ లీటర్ల మందును 20 కిలోల పొడి ఇసుకలో కలిపి ఎకరా విస్తీర్ణంలో చల్లాలి. విత్తిన 20-25 రోజులకు కోనో వీడర్‌ని నడపాలి. దీని వల్ల వరుసల మధ్యలో మొలిచిన కలుపు మొక్కలు తిరగబడి మట్టిలో కలిసిపోతాయి. విత్తిన 60 రోజుల తరువాత కలుపు సమస్య అధికంగా ఉంటే సైహలో పాస్ బ్యుటైల్ అనే మందును పది లీటర్ల నీటికి 40 మిల్లీలీటర్ల చొప్పున కలిపి కలుపు మొక్కలపైన మాత్రమే పిచికారీ చేసుకుంటే సరిపోతుంది. అవసరం మేరకు కూలీలతో ఒక్కసారి కలుపు తీయించుకోవాలి.

నీటి యాజమాన్యం

విత్తనం వేసిన్పటి నుంచి పొట్ట దశ వరకు పొలంలో నీరు నిల్వ ఉంచకుండా కేవలం తడిగా ఉండేటట్టు చూసుకోవాలి. వేర్లు ఆరోగ్యవంతంగా పెరిగి మొక్కలు ఎక్కువ పిలకలు పెడతాయి.పైరు పొట్టదశ నుంచి పంట కోయడానికి పది రోజుల ముందు వరకు పొలంలో రెండు సెంటీ మీటర్ల లోతున నీరు నిల్వ ఉండేటట్టు చూసుకోవాలి.

సస్యరక్షణ చర్యలు

సాధారణ పద్ధతిలో వరి సాగుతో పోల్చుకుంటే డ్రమ్ సీడర్ విధానంలో చీడపీడల తాకిడి తక్కువ ఉంటుంది. గాలి, వెలుతురు బాగా ప్రసరించడం వల్ల మొక్కలు ఆరోగ్యంగా పెరుగుతాయి. ఈ ప్రక్రియలో కొంతమంది రైతులు పొలానికి నీరు పెట్టకుండా, బెట్టకు గురిచేస్తుంటారు. దీనివల్ల ఆకుముడత పురుగు, సుడిదోమ, కాండంతొలుచు పురుగు ఆశించే అవకాశం వుంది. వీటి నివారణ కోసం వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటించి క్రిమి సంహారక మందులను పిచికారీ చేయాలి. సాధారణ పద్ధతితో పోలిస్తే డ్రమ్ సీడర్ విధానంలో వారం నుంచి పది రోజులు ముందుగానే పంట కోతకు వస్తుంది. పైగా 30 శాతం వరకు దిగుబడి పెరుగుతుంది. మరింత సమాచారం కోసం 89784 51144 నంబర్‌కు ఫోన్ చేసి సంప్రదించాలని శాస్త్రవేత్త వానా ప్రసాదరావు కోరారు.

క్రైం... crime news

రైలు నుంచి జారి పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కశింకోట, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి రైల్వే స్టేషన్ యార్డు వద్ద రైలు నుంచి గుర్తు తెలియని వ్యక్తి జారి పడి మృతిచెందాడు. ఈ సంఘటనకు సంబంధించి తుని రైల్వే స్టేషన్ ఎస్‌ఐ జి.శ్రీనివాసరావు తెలిపిన సమాచారం మేరకు.. సోమవారం ఉదయం తుని వైపు నుంచి విశాఖపట్నం వైపు వెళుతున్న ఒక రైలు నుంచి సుమారు 45 సంవత్సరాలున్న వ్యక్తి ఎలమంచిలి రైల్వే స్టేషన్ యార్డు వద్ద జారి పడ్డాడు. తలకు తీవ్రగాయం కావడంతో రైల్వే సిబ్బంది 108 అంబులెన్స్‌లో అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కొద్దిసేపటి తరువాత మృతి చెందాడు. ఇతని వద్ద వివరాలు లభ్యం కాలేదు. నీలం రంగు మీద నలుపు రంగు గడులు కలిగిన ఫుల్ హ్యాండ్స్ చొక్కా, సిమెంటు రంగు జీన్స్‌ప్యాంట ధరించి ఉన్నాడు. ఛాతిపై కుడివైపున హార్ట్ సింబల్‌లో 'మోహన్' అని పచ్చబొట్టు ఉంది. మృతదేహాన్ని ఎన్టీఆర్ ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచారు. మృతుని వివరాలు తెలిసిన వారు తుని పోలీసు స్టేషన్(94906 19020)కు ఫోన్ చేసి సంప్రదించాలని ఎస్‌ఐ కోరారు.

నేల బావిలో వివాహిత మృతదేహం

రావికమతం, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని గర్నికం పంచాయతీ శివారు కానాడ గ్రామంలో సోమవారం ఓ వివాహిత నేల బావిలో శవమై తేలింది. ఆమె ప్రమాదవశాత్తూ నేల బావి లో పడిందా?, లేక ఆత్మహత్య చేసుకుందా? అనే వివరాలు తెలియరాలేదు. దీనికి సంబంధించి రావికమతం ఎస్‌ఐ రఘువర్మ, మృతురాలి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. గర్నికం గ్రామానికి చెందిన శివలక్ష్మి(31)కి కానాడ గ్రామానికి చెందిన పసలపూడి చిరంజీవితో 13 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు ఉన్నారు. శివలక్ష్మికి అప్పుడప్పుడు మూర్ఛ వస్తుండేదని కుటుంబ సభ్యులు తెలిపారు. కాగా సోమవారం ఉదయం ఆమె గ్రామ శివారుకు పశువులను మేతకు తోలుకువెళ్లింది. అయితే మూర్ఛ వచ్చి ఆమె నేల బావిలో పడిపోయిందా? లేక ఇంకేదైనా కారణమా? అనేది తెలియలేదు. ఆమె కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసుల్లో జైలు శిక్ష, జరిమానా

నక్కపల్లి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలో ఆదివారం నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన నలుగురు వ్యక్తుల్లో ఇద్దరికి నాలుగు రోజుల చొప్పున జైలు శిక్ష విధిస్తూ సోమవారం ఎలమంచిలి కోర్టు తీర్పు చెప్పినట్టు ఎస్‌ఐ సన్నిబాబు చెప్పారు. మిగిలిన ఇద్దరికి రూ.10 వేల చొప్పున జరిమానా విధించారన్నారు.

జోనల్‌స్థాయి హాకీ పోటీలకు జట్ల ఎంపిక


జోనల్‌స్థాయి హాకీ పోటీలకు ఎంపికైన బాలుర, బాలికల జట్లు

నక్కపల్లి, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక హాకీ మైదానంలో సోమవారం జిల్లా స్థాయి బాలుర, బాలికల హాకీ జట్ల ఎంపిక జరిగింది. ఏపీ క్రీడా ప్రాధికార సంస్థ, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రీడాజట్ల ఎంపిక పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారితో నాలుగు జిల్లాస్థాయి జట్లను ఎంపిక చేసినట్టు జిల్లా స్పోర్ట్స్ అథారిటీ అధికారి ఎల్‌వీ రమణ చెప్పారు. నక్కపల్లి, ఎలమంచిలి ప్రాంతాల నుంచి ఒక్కొక్క జట్టులో ఎనిమిది మంది చొప్పున క్రీడాకారులు వుంటారని చెప్పారు. వీరు త్వరలో విశాఖలో జరగనున్న జోనల్ స్థాయి పోటీల్లో పాల్గొంటారని, అక్కడ ప్రతిభ చూపిన వారితో రాష్ట్రస్థాయి పోటీలకు తుది జట్లను ఎంపిక చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్ హాకీ క్లబ్ వ్యవస్థాపకులు బలిరెడ్డి సూరిబాబు, అధ్యక్షుడు చిన్న అప్పారావు, కార్యదర్శి కొల్నాటి తాతాజీ,జాతీయ సీనియర్ క్రీడాకారుడు రామచంద్రరావు, హెచ్‌ఎం విజయ, కోచ్ రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఎంపికైన క్రీడాకారులు

బాలుర విభాగంలో నక్కపల్లికి చెందిన ఏఎన్‌వీ సాయిబాబు, ఎం.మణికంఠ, ఎం.దిలీప్, ఎస్.తేజ, ఎ.దుర్గ, రిషి, ఎ.సత్య నీరజ్, పి.రోహిత్, ఎలమంచిలికి చెందిన ఎం.వినయ్, జి.సాయి వెంకట కుమార్, బి.గణపతి, జి.ప్రశాంత్, ఆర్.మోహిత్‌సాయి, ప్రసాద్, దుర్గ, టి.నాగ గణేశ్; బాలికల విభాగంలో నక్కపల్లికి చెందిన ఎం.పూర్ణిమ, డి.సత్య, జి.హారిక, ఆర్.చైతన్య, గీతాశ్రీ, సౌమ్య, అనురాధ, భార్గవి, ఎలమంచిలికి చెందిన కృప, కుసుమ, ఉష, మహేశ్వరి, శ్రావ్య, భవానీ, శ్రావణి, కిరణ్మయి ఎంపికయ్యారు.

పీజీఆర్‌ఎస్ అర్జీలను వేగంగా పరిష్కరించాలి

» కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి కలెక్టరేట్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్‌ఎస్)లో అందే అర్జీలను అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌లో జేసీ జాహ్నవి, డీఆర్‌ఓ సత్యనారాయణరావులతో కలసి ఆమె ప్రజలను నుంచి అర్జీలను స్వీకరించారు. అనంతరం అధికారులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజలు అందజేసిన అర్జీల గురించి సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకొని అర్జీదారులకు నిర్ణీత సమయంలో న్యాయం చేయాలన్నారు. అర్జీలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. పరిష్కరించడానికి వీలుకాని పక్షంలో అందుకుగల కారణాలను అర్జీదారులకు తెలియజేయాలన్నారు. కాగా పీజీఆర్‌ఎస్‌లో మొత్తం 291 అర్జీలు అందాయని కలెక్టరేట్ విభాగం అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఈవో గిడ్డి అప్పారావునాయుడు, జిల్లా వ్యవసాయాధికారి మోహన్‌రావు, జిల్లా పంచాయతీ అధికారి సందీప్ పాల్గొన్నారు.


అర్జీదారుని సమస్యను ఆలకిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్


ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ తుహిన్‌సిన్హా

జిల్లా పోలీసు కార్యాలయంలో...

అనకాపల్లి రూరల్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): పీజీఆర్‌ఎస్‌లో అందే అర్జీలు/ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించి బాధితులకు భరోసా ఇవ్వాలని ఎస్పీ తుహిన్‌సిన్హా పోలీసులు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్‌ఎస్‌లో ఆయన పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వారితో స్వయంగా మాట్లాడి సమస్యలను ఆలకించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, అర్జీలను నిశితంగా పరిశీలించి, ఫిర్యాదులో పేర్కొన్న అంశాల వాస్తవికతను నిర్ధారించిన వెంటనే చట్టపరంగా చర్యలు తీసుకోవాలన్నారు. అర్జీ అందిన ఏడు రోజులలోపు విచారణ పూర్తి చేసి పరిష్కరించాలన్నారు. మొత్తం 35 అర్జీలు అందగా.. ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాలు, మోసాలు వంటి వాటికి సంబంధించినవి అధికంగా వున్నట్టు జిల్లా పోలీస్ కార్యాలయం అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ (క్రైమ్) ఎల్.మోహనరావు, ఎస్‌ఐ వెంకన్న పాల్గొన్నారు.

జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడిగా వర్మ


ఎంఎస్‌వీఎస్‌పీ వర్మ

దేవరాపల్లి, ఆగస్టు 11(ఆంధ్రజ్యోతి): జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడిగా ఎంఎస్‌వీఎస్‌పీ వర్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక కైరళీ ఇంగ్లీషు మీడియం పాఠశాలలో సోమవారం జిల్లా 18వ మహాసభ జరిగింది. వివిధ మండలాల నుంచి 52 మంది ప్రతినిధులు హాజరయ్యారు. రాష్ట్ర నాయకులు కె.త్రిమూర్తులరెడ్డి, కె.శేషగిరిరావు మహాసభకు పరిశీలకులుగా వ్యవహరించారు. జిల్లాలో పర్యావరణం విధ్వంసాన్ని ఆపాలని ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానం చేశారు. అనంతరం నూతన కమిటీ ఎన్నిక జరిగింది. జిల్లా అధ్యక్షుడిగా ఎంఎస్‌వీఎస్‌పీ వర్మ(కశింకోట), ప్రధాన కార్యదర్శిగా కె.వరప్రసాద్(ఎస్.రాయవరం), ఉపాధ్యక్షులుగా బీవీఎస్ వేణు(కె.కోటపాడు), బీఎస్ రామ్‌కుమార్ (అచ్యుతాపురం), కె.రాంబాబు (దేవరాపల్లి), అలాగే గౌరవ అధ్యక్షునిగా ఎంకే దినేశ్, మరో ఏడుగురు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

జిల్లాస్థాయి బాలికల వాలీబాల్ జట్టు ఎంపిక


ఎంపికైన బాలికల వాలీబాల్ జట్టు

అనకాపల్లి టౌన్, ఆగస్టు 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో జిల్లాస్థాయి బాలికల వాలీబాల్ జట్టు ఎంపిక సోమవారం జరిగింది. మొత్తం 14 మంది బాలికలు హాజరుకాగా వీరిలో 12 మందిని ఎంపిక చేశారు. ఈ నెల 16 నుంచి 20వ తేదీ వరకు విశాఖలో జరిగే జోనల్ పోటీల్లో పాల్గొంటారని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎల్‌వి రమణ తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభచూపిన క్రీడాకారులు విజయవాడలో 21 నుంచి 25వ తేదీ వరకు జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. కోచ్ కమ్ మేనేజర్లుగా బీశెట్టి శ్రీనివాసరావు, విల్లూరి ప్రసాద్ వ్యవహరిస్తారని తెలిపారు. ఎంపిక కార్యక్రమంలో క్రీడాకారులు యల్లపు గోవింద, రాపేటి సీతారాం, దాడి ఓంశివ, పీలా రమణారావు, బుద్ధ శివ, కెఆర్‌కె సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎంపికైన క్రీడాకారులు

జి.ఎం.శ్రావ్య (పాయకరావుపేట), ఎస్.హిమశ్రీ (కె.కోటపాడు), బి.మేరీగ్రేస్ (సబ్బవరం), కె.హరిణి (ఎస్.రాయవరం), ఎ.ఝాన్సీరాణి (పరవాడ), పి.పావని (ఎస్.రాయవరం), బి.అలేఖ్రశ్రీ (పెదగుమ్ములూరు), వి.డి.ప్రియాంక (పెదగుమ్ములూరు), జి.రాజేశ్వరి (ఎస్.రాయవరం), ఎన్.శ్వేతశ్రీ (కశింకోట), పి.మనీషా (ఎస్.రాయవరం), బి. అన్నపూర్ణ (అనకాపల్లి).

డ్వాక్రాలకు మరింత వెలుగు

... 5వ పేజీ తరువాయి

అప్పుడు రుణాలు తీసుకునేందుకు అవకాశం ఉండదు.

డ్వాక్రా సంఘాలకు రుణాల మంజూరులో చిన్న పరిశ్రమలు, వ్యాపారాల నిర్వహణకు ప్రాధాన్యం ఇచ్చారు. ఈ ప్రకారం జిల్లాలోని డ్వాక్రా సంఘాల్లో 85 శాతం మందికి జీవనోపాధి యూనిట్లు ఏర్పాటుకు రుణాలు మంజూరు చేయాలని అధికారులు నిర్ణయించారు. వ్యవసాయ ఆధారిత ప్రాంతాల్లో గేదెలు, ఆవుల పోషణ, వివిధ రకాల దుకాణాలు, కుటీర పరిశ్రమల ఏర్పాటు చేసే వారికి రుణాలు మంజూరులో ప్రాధాన్యం ఇస్తారు. తమిళనాడులోని కోయంబత్తూరుకు చెందిన పెరియాగళం హార్టీకల్చరల్ ప్రాజెక్టు సహకారంతో జిల్లాలో బుచ్చెయ్యపేట, గొలుగొండ మండలాల్లో మునగ చెట్ల పెంపకం యూనిట్లు ఏర్పాటుకు రుణ సాయం అందిస్తున్నది. టీ, అరకు కాఫీ స్టాల్స్ యూనిట్ల ఏర్పాటుకు కూడా రుణాలు తీసుకునేందుకు అవకాశం కల్పిస్తున్నారు. ఇంకా కోరమీను చేపలపెంపకం, సముద్ర నాచు సేకరణకు ఉదయ్ ఆక్వాతో సెర్ప్ ఒప్పందాలు కుదుర్చుకుంది. నేషనల్ ఎగ్ కోఆర్డినేషన్ కమిటీ (నెక్) సహకారంతో కోడిగుడ్లతో తినుబండారాలు తయారుచేసి విక్రయించేందుకు, కోళ్ల ఫార్మ్ ఏర్పాటుకు రుణాలు ఇవ్వనున్నారు. చిరుధాన్యాలు, వెదురు పెంపకానికి ఆయా కంపెనీలతో సెర్ప్ ఎంఓయూలు చేసుకోవడం ద్వారా ఆయా యూనిట్ల ఏర్పాటుకు ముందుకు వచ్చే మహిళలకు సంపూర్ణ సహకారం లభించనుంది. షేడ్‌నెట్ కింద కూరగాయల పెంపకం, ఈజీ మార్ట్ ద్వారా గ్రామాల్లో చిన్నపాటి కిరాణా దుకాణాలు పెట్టుకోవడానికి రుణాల మంజూరులో ప్రాధాన్యం వుంటుంది.

డ్వాక్రా సభ్యులు తీసుకున్న రుణాలు, వాటిపై వడ్డీ ఎంత, ఎప్పుడెప్పుడు ఎంతెంత రుణం తిరిగి చెల్లిస్తున్నారు అన్నది స్పష్టంగా తెలిసేలా 'మన డబ్బులు- మన లెక్కలు' అనే యాప్‌ని ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది.

మందకొడిగా ఖరీఫ్

... 5వ పేజీ తరువాయి

కల్యాణపులోవ జలాశయం వున్న రావికమతం మండలంలో 2,181 హెక్టార్లకుగాను 118 హెక్టార్లలో మాత్రమే వరి నాట్లు పూర్తయ్యాయి. కోనాం జలాశయంతోపాటు నదులపై ఆనకట్టలు వున్న చోడవరం మండలంలో 2,582 హెక్టార్లకుగాను 151 హెక్టార్లలో మాత్రమే వరినాట్లు పడ్డాయి. రైవాడ నీరు వచ్చే కె.కోటపాడు మండలంలో 2,348 హెక్టార్లకు 493 హెక్టార్లు, కోనాం జలాశయం పరిధిలోని చీడికాడ మండలంలో 2,824 హెక్టార్లకు 352 హెక్టార్లలో వరినాట్లు వేశారు. మిగిలిన మండలాల్లో వరినాట్లు వంద హెక్టార్లలోపే పడ్డాయి. గత వారం రోజులుగా అక్కడక్కడ చెదురుమదురు జల్లులు మినహా వరిసాగు అవసరాలకు సరిపడ వర్షాలు కురవడం లేదు.

పట్టణ నడిబొడ్డున కంపోస్టు యార్డు!

... 5వ పేజీ తరువాయి

ఆ గ్రామస్థులు ఆందోళనలకు దిగారు. ప్రత్యామ్నాయ ప్రదేశం లేకపోవడంతో పట్టణంలో సేకరించిన చెత్తను, విశాఖలోని కాపులుప్పాడ డంపింగ్‌యార్డుకు తరలించాలని అధికారులు నిర్ణయించారు. అయితే పట్టణంలోని వివిధ వార్డుల్లో సేకరించిన చెత్తాచెదారన్ని జీవీఎంసీ జోనల్ కార్యాలయం ఆవరణలో వున్న ఖాళీ స్థలంలోకి చేర్చి, ఇక్కడ నుంచి భారీ వాహనాల ద్వారా కాపులుప్పాడ తరలిస్తున్నారు. అప్పటి నుంచి ఈ ప్రక్రియ ఇలానే కొనసాగుతున్నది. పట్టణంలో సేకరించిన చెత్తను ఇక్కడ డంప్ చేయడానికి, తరువాత కాపులుప్పాడ యార్డుకు తరలించడానికి మధ్య గంటల వ్యవధి వుండడంతో చెత్తాచెదారం కుళ్లిపోయి తీవ్ర దుర్వాసన వస్తున్నది. చట్టుపక్కల ఇళ్లల్లో నివాసం వుంటున్న వారితోపాటు పాఠశాలల, కళాశాలలో వున్న విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. మధ్యాహ్నం భోజనం చేసే సమయంలో తీవ్ర దుర్వాసన వస్తుండడంతో వాంతులు అవుతున్నాయని విద్యార్థులు వాపోతున్నారు. జీవీఎంసీ జోనల్ కార్యాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులతోపాటు, వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు కూడా ఇబ్బంది పడుతున్నారు. ఈ ప్రాంతంలో నివాసముంటున్న విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం వ్యవస్థాపకులు పాతర్లపల్లి వీరుయాదవ్.. టాన్సిట్ కంపోస్టు యార్డును ఇక్కడి నుంచి తరలించాలని పలుమార్లు ఆందోళనలు చేశారు. ప్రజాప్రతినిధులు కూడా కంపోస్టుయార్డును తరలించాలని కోరారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన ప్రతి జోనల్ కమిషనర్ దృష్టికి కంపోస్టు యార్డు సమస్య వచ్చింది. కానీ ఏ ఒక్కరూ పట్టించుకోలేదు. దీనిపై జీవీఎంసీ జోనల్ కమిషనర్ కె.చక్రవర్తిని 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా.. కంపోస్టు ట్రాన్సిట్ యార్డు సమస్యను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లామని, త్వరలో పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

గాలి, వాన బీభత్సం

... 5వ పేజీ తరువాయి

మోకాలు లోతున నీరు ప్రవహించింది. గంటల తరబడి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.


గచ్చపు వీధిలో సగానికి విరిగిన విద్యుత్ స్తంభం

రావికమతం మండలంలో సోమవారం సాయంత్రం ఈదురు గాలులతో భారీ వర్షం కురిసింది. ఎండిపోతున్న వరినారుకు ఊపిరి పోసిందని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఈదురు గాలుల కార ణంగా పలుచోట్ల చెట్లు విరిగి పడడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. కె.కోటపాడు మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం సాయంత్రం నాలుగు గంటల నుంచి ఐదు గంటల వరకు వర్షం కురిసింది. అంతకుముందు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎండ తీక్షణంగా కాసింది. తరువాత వాతావరణం మారిపోయి ఆకాశం మేఘావృతమై వర్షం పడింది. మాడుగుల మండలంలో పలుచోట్ల కుండపోతగా వర్షం కురిసింది. వాతావరణం చల్లబడడంతో ప్రజలు ఉపశమనం చెందారు. ఎండుతున్న పంటలకు ఈ వర్షం ఊపిరిపోసిందని రైతులు చెబుతున్నారు.

ఎన్నాళ్లీ నరక ప్రయాణం!

... 5వ పేజీ తరువాయి

సాగిస్తుంటారు. అలాగే అధికంగా సొంత వాహనాల్లో, కొందరు ఆర్‌టీసీ బస్సుల్లో ప్రయాణాలు సాగిస్తుంటారు. ఏజెన్సీలో రోడ్లతోపాటు పాడేరు నుంచి ఘాట్ దిగే వరకు అంటే వి.మాడుగుల మండలం తాటిపర్తి వరకు ఎటువంటి గతుకులు లేకుండా ప్రయాణం సాఫీగా సాగుతుంది. కాని అక్కడి నుంచి వి.మాడుగుల మండలం పరిధిలోకి వచ్చే కాశీపురం, తాటిపర్తి, కోడూరు, ఎంకే.వల్లాపురం, ఎం.కోటపాడు, సాగరం జంక్షన్, వడ్డాది, విజయరామరాజు పేట, గౌరీపట్నం జంక్షన్, చోడవరం మండల కేంద్రంతోపాటు గోవాడ, వెంకన్న పాలెం జంక్షన్ వరకు మొత్తం గోతుకుల మయంగానే ఉంది. దీంతో ప్రయాణ సమయం రెట్టింపు కావడంతోపాటు వాహనాలు పాడైపోవడంతోపాటు డ్రైవింగ్ చేసే వాళ్లకు, ప్రయాణికులకు ఒళ్లు నొప్పులు తప్పవడం లేదు. ఇదిలాఉండగా గురువారం ఆయా ప్రాంతాల్లో వర్షం కురవడంతో రోడ్లపై గతుకుల్లో నీరు చేసి అవి చెరువులను తపిస్తున్నాయి. ఘాట్ మార్గంలో హాయిగా సాగిన ప్రయాణం వి.మాడుగుల మండలం తాటిపర్తి నుంచి చోడవరం మండలం వెంకన్నపాలెం జంక్షన్ వరకు నరకాన్ని తలపిస్తుందని ప్రయాణికులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి ఈఏడాది మార్చిలోనే ఈరోడ్డును మెరుగుపర్చేందుకు పనులు ప్రారంభించినప్పటికీ నేటికీ అవి కార్యరూపం దాల్చలేదు. దీంతో జనం రాకపోకలకు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి రోడ్డు సమస్యను పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	93.00
లైవ్ ధర	113.00
విత్ స్కిన్	196.00
స్కిన్ లెస్	206.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	515
విజయనగరం	519
శ్రీకాకుళం	519